RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

| హైదరాబాద్ | ఆదివారం, అక్టోబరు 11, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 160 | పేజీలు: 8 | వెల : రూ.1 |
|---|---|---|---|---|---|---|

## ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు కూటమికి ఎదురుదెబ్బ

ఈయూా - టీఎంయూ

-ఎన్ఎంయూ కూటమి ఘన విజయం

మంత్రులు, పార్టీ నేతల ప్రచారం చేసినా దక్కని ఫలితం

2లో

## క్రీడా రంగ అభివృద్ధికి అత్యాధునిక మౌలిక సదుపాయాలు

తెలంగాణను అంతర్జాతీయ స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దుతాం

గోల్కొండ సమీపంలో ఐజీపీఎల్ టోర్నీ ముగింపు వేడుకల్లో పాల్గొన్న మంత్రులు



**హైదరాబాద్, అక్టోబరు10(వాయిస్‌టుడే):** తెలంగాణలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీయడానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంతో పాటు, దక్షిణ కొరియా వంటి దేశాల క్రీడా శిక్షణ విధానాలను ఆదర్శంగా తీసుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణా కార్యక్రమాలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించింది. గోల్కొండ కోట సమీపంలోని హైదరాబాద్ గోల్ఫ్ అసోసియేషన్ కోర్సులో నిర్వహించిన ఇండియన్ గోల్ఫ్ ప్రీమియర్ లీగ్ (ఐజీపీఎల్) టోర్నమెంట్ ముగింపు వేడుకల్లో మంత్రితో కలిసి పాల్గొన్నారు. ఇలాంటి అంతర్జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు రాష్ట్ర క్రీడా రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు స్థానిక పర్యాటక అభివృద్ధికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. తెలంగాణను ప్రముఖ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, విజేతలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.



## తాగు, సాగునీరు.. విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి

**ఎల్‌నినో ముప్పుపై అప్రమత్తం.. పకడ్బందీ కార్యాచరణకు సీఎం ఆదేశం**

రాబోయే 8 నెలలు కీలకం.. గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు

వర్షాభావం ఉన్న 215 మండలాలపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, అక్టోబరు10(వాయిస్‌టుడే):** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలో ముందస్తు చర్యలకు పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తాగునీరు, సాగునీరు, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో ఎదురయ్యే సమస్యలను ముందుగానే అంచనా వేసి, వాటిని సమర్థంగా ఎదుర్కొనేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితులపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. రాబోయే ఎనిమిది నెలలు కీలకమని పేర్కొన్న ఆయన.. ఈ కాలంలో చేపట్టే ప్రతి చర్యలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రజలను అప్రమత్తం చేసి, సమస్యలను ఎదుర్కొనేందుకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### విద్యుత్ పొదుపుపై దృష్టి

రాబోయే రోజుల్లో విద్యుత్ కొరత తీవ్రతరమయ్యే అవకాశం ఉందని సీఎం తెలిపారు. రాష్ట్ర అవసరాల కోసం విద్యుత్ కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, మార్కెట్‌లో విద్యుత్ లభ్యత సమస్యగా మారుతోందని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ ఆధారిత పనులను సాధ్యమైనంత మేరకు తాత్కాలికంగా వాయిదా వేసుకునేలా

మిగతా 2లో

## నేతల పనితీరుపై రేవంత్ నజర్

ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయ సేకరణకు రహస్య సర్వే?

ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపైనా ఆరా

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజా నాడి తెలుసుకునే యత్నం



**హైదరాబాద్, అక్టోబరు10 (వాయిస్‌టుడే):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ఆత్మపరిశీలనకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరు, ప్రజాప్రతినిధుల వ్యవహారశైలి, సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకునేందుకు ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీతోపాటు ఇతర మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రక్రియ చేపట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

### గ్రామస్థాయి నుంచి నగరాల వరకు ఆరాలి

ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి? పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు? స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల పనితీరుపై అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ప్రజల స్పందనను తెలుసుకునే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు అందుతున్నాయా లేదా అనే అంశాలపైనా దృష్టి సారిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూలత, అసంతృప్తికి కారణాలను గుర్తించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టాలన్నది ఈ సర్వే ఉద్దేశంగా భావిస్తున్నారు.

### సమస్యాత్మక అంశాలపై ప్రత్యేక దృష్టి

హైడ్రా కార్యకలాపాలు, ఉచిత సంక్షేమ పథకాలు, విద్యుత్ సరఫరా, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి అంశాలపై ప్రజల

- మిగతా 2వ పేజీలో

## 14న సింగరేణి కార్మిక గర్జన

రామగుండం వేదికగా బీఆర్ఎస్ సభ

కార్మికుల లాభాల వాటా తగ్గింపుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయనున్న ప్రతిపక్షం

కేటీఆర్, హరీశ్‌రావు హాజరు

ఆదిలాబాద్, అక్టోబరు 10: సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమైంది. కార్మికుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ అక్టోబరు 14న రామగుండంలో 'సింగరేణి కార్మిక గర్జన' సభ నిర్వహించనుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్‌రావుతోపాటు పలువురు నాయకులు ఈ సభకు హాజరుకానున్నారు. సింగరేణి లాభాల్లో కార్మికులకు అందించే వాటా తగ్గిపోయిందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు 32 శాతం లాభాల వాటా అందించామని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అది తగ్గిందని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ తొలి సంవత్సరంలో వాటా 16 శాతానికి, 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని ఆరోపించారు.

## నవంబర్ రెండో వారం నుంచి కాళేశ్వరం పనులు

2027 వర్షాకాలం నాటికి మూడు బ్యారేజీల పునరుద్ధరణ లక్ష్యం

కొత్త డిజైన్లకు సాంకేతిక అనుమతుల తర్వాత పనులు ప్రారంభం

భద్రత, నిర్మాణ నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్

2లో

## చిన్న పరిశ్రమలదే కీలకపాత్ర

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఎంఎస్ఎంఈల కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్: శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌లో ఎంఎస్ఎంఈల లఘు ఉద్యోగ్ భారతి దక్షిణ భారత సదస్సు



- మిగతా 2వ పేజీలో




## కవులు ఏ పుస్తకం రాసినా ప్రచురించే బాధ్యత నాది: హరీశ్‌రావు

సిద్దిపేట సాహిత్య వైభవం చాటిచెప్పిన కవి సమ్మేళనం

అక్షరాలు, మంచి పనులే సమాజంలో శాశ్వతంగా నిలిచిపోతాయి

సిద్దిపేట: కవులు ఏ పుస్తకం రాసినా స్వయంగా అచ్చు వేయించి ప్రచురించే బాధ్యత తాను తీసుకుంటానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రకటించారు. సిద్దిపేట జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక విపంచి కళానిలయంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జీవితం శాశ్వతం కాదని, సమాజంలో శాశ్వతంగా నిలిచిపోయేవి అక్షరాలు, మనం చేసే మంచి పనులేనని పేర్కొన్నారు. సిద్దిపేటకు సాహిత్య రంగంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, నంది పురస్కారాల నుంచి జాతీయ సాహిత్య అకాడమీ వరకు అనేక అవార్డులు ఈ ప్రాంతానికి దక్కుతున్నాయని తెలిపారు.

స్వరాష్ట్రంలో సిద్దిపేట ఎన్నో రంగాల్లో గుణాత్మక

- మిగతా 2వ పేజీలో

## రేడియల్ రోడ్-2 టెండర్లలో అవినీతి.. రద్దు చేయాలి

రూ.3,296 కోట్ల టెండర్లపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలి

రూ.600 కోట్ల నష్టం ఆరోపణపై సమగ్ర విచారణ జరపాలి

టెండర్ల పత్రాలు, మూల్యాంకన నివేదికలు బయటపెట్టాలి

ముఖ్యమంత్రికి కేటీఆర్ బహిరంగ లేఖ

**హైదరాబాద్, అక్టోబరు10(వాయిస్‌టుడే):** బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి సంబంధించి రూ.3,296 కోట్ల రేడియల్ రోడ్-2 (ఆర్ఆర్-2) టెండర్లలో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. టెండర్లను ప్యాకేజీలుగా విభజించి, ముందుగా నిర్ణయించుకున్న సంస్థలకే పనులు కట్టబెట్టారని విమర్శించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ఆయనకు బహిరంగ లేఖ రాశారు. తక్కువ ధరలకు బిడ్లు వేసిన సంస్థలను పక్కనపెట్టి, ఎక్కువ ధరలు కోట్ చేసిన కంపెనీలకు పనులు అప్పగించారని కేటీఆర్ ఆరోపించారు. తమకు నచ్చిన సంస్థలకు టెండర్లు కట్టబెట్టేందుకు సాంకేతిక కారణాలను చూపుతూ ఇతర బిడ్డర్లను అనర్హులుగా ప్రకటించారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో వందల కోట్ల

మిగతా 2లో



## తెలంగాణ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు

అశ్వారావుపేటలో రాష్ట్రస్థాయి బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభం

రూ.23.5 కోట్లతో అభివృద్ధి చేసిన రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

తెలంగాణను క్రీడారంగంలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఖమ్మం/అశ్వారావుపేట: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన ప్రకృతి పూల పండుగ బతుకమ్మను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు మంత్రి తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో బతుకమ్మకు చేసే పూజలు ఫలించాలని, తెలంగాణ ఆడబిడ్డలతో పాటు ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఖమ్మం, నల్గొండ, వరంగల్

మిగతా 2లో

RNI No: TGTEL/25/A2649 VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు ప్రజల గొంతుక - నిజం కోసం.. తెలుగు దినపత్రిక
హైదరాబాద్
ఆదివారం 11 అక్టోబరు 2026

# తాగు, సాగునీరు.. విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాను సీఎంఓ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### పంట చేతికొచ్చే వరకు నీటి భరోసా

రైతులు సాగు చేసిన పంటల పరిస్థితిని అంచనా వేసి, పంట చేతికొచ్చే వరకు నీటి కొరత తలెత్తకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో నీటి సమస్య తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, చుక్క నీటిని కూడా వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు.

ఎల్‌నినో ప్రభావంపై సినిమా, మీడియా, కళాజాతాలు తదితర మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దసరా తర్వాత గ్రామం, మండలం, జిల్లా, రాష్ట్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

### 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు

రాష్ట్రంలో సుమారు 215 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, కరువు మండలాల ప్రకటనతో పాటు తగిన ఆర్థిక సాయం అందించాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయాన్ని సీఎం గుర్తుచేశారు. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

VB-G RAM G పథకం కింద ప్రస్తుతం కల్పిస్తున్న 125 రోజుల ఉపాధికి అదనంగా మరో 50 రోజుల పని కల్పించాలని కేంద్రాన్ని కోరాలని అధికారులకు సూచించారు. అదనపు పని దినాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. అవసరమైతే అఖిలపక్ష సమావేశం నిర్వహించే అంశాన్ని మంత్రుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

### మంత్రులతో ప్రత్యేక సమావేశం

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై త్వరలో మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల పరిస్థితులను సమీక్షించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

**రూ.35.19 కోట్లతో ధర్మసత్రం, దీక్ష విరమణ మండపం నిర్మాణం**

**నవంబర్ 15 నుంచి 20 వరకు చందనోత్సవాలు**

చొప్పదండి: జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రిగారి హనుమంతరావు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి అంజనా రెడ్డి కమిషనర్ దంపతులకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొండగట్టు దేవస్థాన అభివృద్ధికి అవసరమైన పలు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ.35.19 కోట్ల నిధులతో 96 గదుల ధర్మసత్రం, దీక్ష విరమణ మండపం నిర్మాణానికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. నవంబర్ 15 నుంచి 20 వరకు నిర్వహించనున్న శ్రీ స్వామివారి చందనోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో అంజనా రెడ్డి, సహాయ కార్యనిర్వహణాధికారి హరిహరనాథ్, పర్యవేక్షకులు సునీల్ కుమార్ గౌడ్, ప్రధాన అర్చకులు డాక్టర్ జితేంద్ర ప్రసాద్, చిరంజీవి స్వామి, మారుతి ప్రసాద్, స్థానాచార్యులు కపిందర్, ఆలయ పరిశీలకులు అశోక్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో లఘు ఉద్యోగ్ భారతీ సౌత్ ఇండియా కాంక్లేవ్

**ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈలదే కీలకపాత్ర**

హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పాత్ర కీలకమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన లఘు ఉద్యోగ్ భారతీ సౌత్ ఇండియా కాంక్లేవ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉపాధి కల్పన, ఆర్థిక అభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు కీలకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఈ రంగానికి రుణ సదుపాయాలు, మార్కెట్ అవకాశాలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులు, ఎంఎస్ఎంఈల మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

విశాఖపట్నం, మహారాష్ట్రలో మినరల్ పార్కుల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. భారత ఆర్థిక వ్యవస్థపై తప్పుడు ప్రచారం జరుగుతోందని వ్యాఖ్యానించారు. దేశ భవిష్యత్తును కాపాడుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## విజయవాడ రైల్వే స్టేషన్‌లో దసరా భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

**రద్దీ నియంత్రణకు ఏడు ప్రత్యేక రైళ్లు**

**మూడు షిఫ్టుల్లో 100 నుంచి 200 మంది సిబ్బందితో భద్రత**

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల రద్దీని నియంత్రించడంతో పాటు, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటోంది. రైల్వే ఐజీ బి. రాజకుమారి మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏడు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేరళ, తమిళనాడు, సికింద్రాబాద్, విశాఖపట్నం, గుజరాత్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 10 నుంచి 22 వరకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మూడు షిఫ్టుల్లో 100 నుంచి 200 మంది సిబ్బందిని భద్రతా విధులకు కేటాయించినట్లు తెలిపారు. తోపులాటలు, ఎదురెదురుగా రాకపోకల వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. పార్సల్ కార్యాలయం వద్ద అడ్డుగా ఉన్న గోడను తొలగించి, భక్తులు సులభంగా వెళ్లేందుకు మార్గాన్ని సౌకర్యవంతంగా మార్చినట్లు చెప్పారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్, లా అండ్ ఆర్డర్ పోలీసుల సమన్వయంతో కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. తప్పిపోయిన చిన్నారుల వివరాలను గుర్తించేందుకు పోలీస్ అవుట్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణంలో సమస్యలు ఎదురైతే రైల్వే సహాయం కోసం లి139, అత్యవసర పోలీసు సహాయం కోసం లిలి112లి నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు. దసరా ఉత్సవాలకు విజయవాడ వచ్చే భక్తులు రైల్వే శాఖ సూచనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని కోరారు.




## ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు కూటమికి ఎదురుదెబ్బ

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కూటమి విజయం సాధించింది.

కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూయూ) కూటమికి ఈ ఎన్నికల్లో నిరాశ ఎదురైంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రచారం చేసినప్పటికీ ఆశించిన ఫలితం దక్కలేదు. మరోవైపు, బీఆర్ఎస్ పార్టీ లేదా దాని అనుబంధ కార్మిక సంఘం ఈ ఎన్నికల్లో ఏ కూటమికీ మద్దతు ప్రకటించలేదు. అయినప్పటికీ కాంగ్రెస్ మద్దతు కూటమి ఓటమి పాలవడం రాజకీయ, కార్మిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## చిన్న పరిశ్రమలదే కీలకపాత్ర

హైదరాబాద్: వికసిత్ భారత్ లక్ష్య సాధనలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వాటి ఉత్పత్తులు ప్రపంచ దేశాలతో పోటీ పడాలన్నారు. ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతికతను ఒడిసిపట్టుకుని.. నాణ్యత, నవ్యతకు పెద్దపీట వేస్తూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా దూసుకెళ్లాలని ఉద్బోధించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లో తెలంగాణ లఘు ఉద్యోగ్ భారతి ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్ఎంఈల దక్షిణ భారత సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. "తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం వంటి చర్యల ద్వారా కేంద్రం ఉత్పత్తులకు అండగా నిలుస్తోంది. అంకురాలకు కావాల్సిన అనుమతులను త్వరితగతిన ఇస్తోంది. భారత్ ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. దీన్ని ఓర్వలేక మన దేశ ప్రతిపక్ష నాయకుడు 'ఇండియన్ ఎకానమీ డెడ్' అని పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేయడం దారుణం" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

### సమస్యల పరిష్కారానికి నెలకోసారి వినతుల దినం

తెలంగాణలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి కోసం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఆయన ఉదయం జరిగిన సదస్సుకు హాజరై ప్రసంగించారు. "చిన్న పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు రెండు ఎకరాల్లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు చేస్తాం. క్షేత్ర స్థాయిలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి ఆచరణాత్మక పరిష్కారాలు చూపించేందుకు నెలకోసారి వినతుల దినాన్ని నిర్వహిస్తాం. దానిలో ప్రస్తావించే అంశాలను పరిష్కరిస్తాం" అని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఎండీ రామ్మోహన్‌రావు, డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ సతీశ్‌రెడ్డి, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు వై.వెంకటేశ్వర్లు, కె.నరేంద్రనాథ్‌దత్, ఓం అనూజ్ ఖదేల్వాల్ నారాయణనాథ్, అనిల్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లఘు ఉద్యోగ్ భారతి పోర్టల్‌ను ఆవిష్కరించారు.



## నవంబర్ రెండో వారం నుంచి కాళేశ్వరం పనులు

కరీంనగర్, అక్టోబరు 10: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారం నుంచి ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2027 వర్షాకాలం నాటికి మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు.

### సాంకేతిక అనుమతుల తర్వాతే పనులు

బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి కొత్త డిజైన్లను కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పిస్తామని మంత్రి తెలిపారు. అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో పనులను వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణ నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేయడంతోపాటు నీటి నిల్వ, వినియోగ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యమని తెలిపారు.

### 2023లో మేడిగడ్డలో కుంగిన పిల్లర్లు

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీలో 2023లో కొన్ని పిల్లర్లు కుంగిపోవడంతో ప్రాజెక్టు భద్రతపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల స్థితిగతులు, పునరుద్ధరణపై చర్చ మొదలైంది. బ్యారేజీల నిర్వహణ, నిర్మాణ లోపాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు గోదావరి నదిపై నిర్మించిన బహుళార్థసాధక ఎత్తిపోతల పథకం. ఏడు లింకులు, 28 ప్యాకేజీలుగా రూపొందించిన ఈ ప్రాజెక్టు సుమారు 500 కిలోమీటర్ల మేర విస్తరించింది. మొత్తం 240 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావడం దీని లక్ష్యం. ఇందులో సాగునీటితోపాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలు, సమీప గ్రామాల తాగునీటి అవసరాలకు నీటిని కేటాయించారు.

మూడు ప్రధాన బ్యారేజీల పునరుద్ధరణ పూర్తయితే ప్రాజెక్టు నీటి నిల్వ, ఎత్తిపోతల సామర్థ్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావడానికి అవకాశం ఉంటుంది. అయితే పనుల ప్రారంభం, పురోగతి సాంకేతిక అనుమతులు, భద్రతా ప్రమాణాల అమలుపై ఆధారపడి ఉంటుంది.

## రేడియల్ రోడ్-2 టెండర్లలో అవినీతి.. రద్దు చేయాలి

రూపాయల ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### టెండర్ల వివరాలు బహిర్గతం చేయాలి

ఆర్ఆర్-2 టెండర్లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రజల ముందుంచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రతి బిడ్డర్‌ను అనర్హుడిగా ప్రకటించడానికి గల నిర్దిష్ట కారణాలతో కూడిన సాంకేతిక మూల్యాంకన నివేదికను విడుదల చేయాలని కోరారు. మూడు ప్యాకేజీల అంచనా వ్యయాలు, తుది కేటాయింపు విలువలు, అర్హత సాధించిన సంస్థల ఆర్థిక బిడ్ల వివరాలను వెల్లడించాలని సూచించారు. బిడ్ ఓపెనింగ్ స్టేట్‌మెంట్లు, కంపారిటివ్ స్టేట్‌మెంట్లు, మూల్యాంకన కమిటీ సమావేశాల మినిట్స్ సహా టెండర్లకు సంబంధించిన అన్ని రికార్డులను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రూ.600 కోట్ల మేర ఆర్థిక నష్టం జరిగిందన్న ఆరోపణపై సమగ్ర విచారణ జరిపి, ధరల వ్యత్యాసాలు, బిడ్ల వివరాలు, తుది కేటాయింపులను పరిశీలించాలని కోరారు.

### భారీ కాంట్రాక్టులపై కాగ్ ఆడిట్

గత మూడేళ్లలో హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ చేపట్టిన



రూ.100 కోట్లకు పైబడిన కాంట్రాక్టులపై కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ద్వారా ప్రత్యేక ఆడిట్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. టెండర్ల ప్రక్రియపై శ్వేతపత్రం విడుదల చేసి, బిడ్డర్లు, అనర్హతకు గురైన సంస్థలు, అంచనా వ్యయాలు, తుది కేటాయింపు ధరలు, కాంట్రాక్టులు పొందిన సంస్థల వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. టెండర్లలో పారదర్శకత పెంచేందుకు స్పష్టమైన నిబంధనలు రూపొందించాలని సూచించారు. సాంకేతిక అర్హతలపై నిర్ణయాలు తీసుకునే విధానం, బిడ్డర్లకు వివరణ ఇచ్చే అవకాశం, సాంకేతిక ఫలితాలు ప్రకటించిన తర్వాత ఆర్థిక బిడ్లు తెరిచే వ్యవధిపై స్పష్టత ఉండాలని పేర్కొన్నారు. ప్రజాధనాన్ని కాపాడేందుకు వివాదాస్పదంగా మారిన ఆర్ఆర్-2 టెండర్లను వెంటనే రద్దు చేసి, ఆరోపణలపై విచారణ జరపాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కవులు ఏ పుస్తకం రాసినా ప్రచురించే బాధ్యత నాది: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

మార్పును సాధించిందని అన్నారు. గతంలో ఎన్నికల సమయంలో గోడలపై నినాదాలుగా మిగిలిన సిద్దిపేట జిల్లా ఏర్పాటు, గోదావరి జలాల సాధన, రైలు మార్గం వంటి కలలు నేడు సాకారమయ్యాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, పచ్చదనం, సాగునీరు, తాగునీటి రంగాల్లో అభివృద్ధి సాధించినట్లు వివరించారు. తాను తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయంలో సిద్దిపేట ప్రాంతంలో ఏటా కేవలం 50 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం మాత్రమే పండేదని, గోదావరి జలాలు, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు విస్తీర్ణం పెరిగి ప్రస్తుతం ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండుతోందని హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు తెలియని ఆయిల్‌పామ్ సాగు ప్రస్తుతం విస్తరించిందని, రైతులు ఈ పంట ద్వారా అధిక లాభాలు పొందుతున్నారని పేర్కొన్నారు. గతంలో రైలు ప్రయాణం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు సిద్దిపేటకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. రైల్వే విద్యుదీకరణ పూర్తయితే ఉత్తర భారతదేశానికి మరింత మెరుగైన రైలు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సిద్దిపేట సాధించిన అభివృద్ధి అంతా ఈ ప్రాంత మట్టి గొప్పతనం, ప్రజల కృషి ఫలితమని హరీశ్‌రావు అన్నారు. పదేళ్ల ప్రగతి పండుగను సిద్దిపేట ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

## తెలంగాణ ఆడబిడ్డలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు.

### సర్వోత్తమ్ రెడ్డి విజయం ఖాయం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటుతోనే విజయం సాధిస్తారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని నవంబర్ 6లోగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, కోరం కనకయ్య, జిల్లా పార్టీ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేతల పనితీరుపై రేవంత్ నజర్

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు సమాచారం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాల అమలు, వాటి ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య, ఎదురవుతున్న సమస్యలపై కూడా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజల అభిప్రాయాలతోపాటు రాజకీయంగా ప్రజల మొగ్గు ఎలా ఉందన్న అంశాన్ని కూడా అంచనా వేయాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌కు మద్దతు తగ్గితే అందుకు కారణాలేమిటన్న ప్రశ్నపైనా ప్రజల స్పందన తెలుసుకుంటున్నట్లు సమాచారం.

### ఎన్నికలకు ముందే దిద్దుబాటు చర్యలా?

ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తున్న అంశాలను ముందుగానే గుర్తించి పరిష్కరించడం ద్వారా పాలనను మెరుగుపరచుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. సర్వే ద్వారా అందే సమాచారం ఆధారంగా పథకాల అమలులో లోపాలను సరిదిద్దడం, ప్రజాప్రతినిధుల పనితీరును సమీక్షించడం వంటి చర్యలకు అవకాశం ఉంటుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఈ సర్వే నిర్వహణ, దాని పరిధి, ఫలితాలపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. సర్వేకు సంబంధించిన వివరాలు వెల్లడైతేనే దాని ఉద్దేశం, తదుపరి చర్యలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# వ్యాపార రంగానికి గ్లోబల్ బూస్ట్.. సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్–2026

**అక్టోబర్ 14, 15 తేదీల్లో**
**హైదరాబాద్‌లో అంతర్జాతీయ సదస్సు**
**SCCను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి..**
**హాజరుకానున్న చిరంజీవి**
**4,500 మందికి పైగా వ్యాపారవేత్తలు..**
**110కి పైగా ఎగ్జిబిషన్ స్టాళ్లు**
**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..**
**ప్రముఖ ఆర్థిక, పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యం**




హైదరాబాద్, అక్టోబర్ 10: వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, అంతర్జాతీయ వ్యాపార భాగస్వామ్యాల విస్తరణ లక్ష్యంగా సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 'సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026' నిర్వహించనున్నారు. ఈ సదస్సు ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కొత్త అవకాశాలు కల్పించడంతో పాటు వ్యాపార నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు వేదిక ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం లక్డీకాపూల్‌లోని హాంప్‌షైర్ ప్లాజా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సదస్సు వివరాలను వెల్లడించారు.

## సీఎం చేతుల మీదుగా SCC ప్రారంభం

అక్టోబర్ 14న ఉదయం 10.30 గంటలకు తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్‌ను ప్రారంభించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పద్మవిభూషణ్ కొణిదెల చిరంజీవి హాజరు కానున్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాస్వాన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొననున్నారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు 'పెట్టుబడి అవకాశాల తెలంగాణ' అంశంపై జరిగే వ్యాపార సదస్సులో కీలకోపన్యాసం చేయనున్నారు.

## 4,500 మందికి పైగా వ్యాపారవేత్తలు

నిర్వాహకుల అంచనా ప్రకారం సదస్సుకు 4,500 మందికి పైగా వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు హాజరుకానుండగా, 110కి పైగా ఎగ్జిబిషన్ స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. 40 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ వక్తలు, అమెరికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రతినిధి బృందాలు పాల్గొననున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో పాటు ప్రముఖ ఆర్థిక, పారిశ్రామిక సంస్థల భాగస్వామ్యం ఉండనుంది. రక్షణ రంగం, సెమీకండక్టర్లు, ఫార్మా, ఐటీ, బయోటెక్నాలజీ, బ్యాంకింగ్, ఎంఎస్ఎంఈ ఫైనాన్స్, వెంచర్ క్యాపిటల్, ప్రైవేట్ ఈక్విటీ, ఐపీఓలు, పన్నుల నిర్వహణ, జీఎస్టీ, విదేశీ వాణిజ్యం, కృత్రిమ మేధ తదితర అంశాలపై చర్చలు, ప్యానెల్ సమావేశాలు నిర్వహించనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు తమ రాష్ట్రాల్లోని పెట్టుబడి అవకాశాలను వివరించడంతో పాటు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయనున్నాయి.

## ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు ప్రత్యేక వేదిక

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు), స్టార్టప్‌లు, మహిళా పారిశ్రామికవేత్తలకు ఈ సదస్సులో ప్రాధాన్యం కల్పించనున్నారు. పెట్టుబడిదారులతో అనుసంధానం, వ్యాపార భాగస్వామ్యాల ఏర్పాటు, కొత్త మార్కెట్ల అన్వేషణ, నైపుణ్యాభివృద్ధి, మెంటర్‌షిప్ వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఎస్‌బీఐ--ఎంఎస్ఎంఈ, సిడ్బీ, బీఎస్ఈ--ఎస్ఎంఈ, బ్యాంకులు, పెట్టుబడి సంస్థలు, ఆర్థిక సలహా సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నారు.



గుజరాత్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, గ్లోబల్ పటిదార్ బిజినెస్ ఆర్గనైజేషన్, డీఐసీసీఐ వంటి సంస్థల ప్రతినిధులు కూడా భాగస్వాములు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా సంస్థల మధ్య దీర్ఘకాలిక సహకారాన్ని పెంపొందించే దిశగా అవగాహన ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశముందని పేర్కొన్నారు.

## మూడు సంస్థల సమష్టి చొరవతో SCC

విశ్వ సమాఖ్య, పటేల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ నెట్‌వర్క్ , ఆల్ ఇండియా తెలగ బలిజ కాపు సంఘం సంయుక్త చొరవతో సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటైంది. ఎంఎస్ఎంఈలు, నూతన పారిశ్రామికవేత్తలకు నిరంతర సహకారం అందించడం, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించడం, శిక్షణ, మెంటర్‌షిప్, మార్కెట్ సమాచారం, విదేశీ వాణిజ్య అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం సంస్థ ప్రధాన లక్ష్యాలని నిర్వాహకులు వివరించారు.

స్టార్టప్ లెర్నింగ్ సెల్, మహిళా పారిశ్రామికవేత్తల సహాయ విభాగం, విదేశీ వాణిజ్య ప్రోత్సాహక విభాగం, వ్యాపార మెంటర్‌షిప్, వెంచర్ క్యాపిటల్--ఏంజెల్ ఫండింగ్, ప్రీ-ఐపీఓ, ప్రైవేట్ ప్లేస్‌మెంట్ అవకాశాలకు సంబంధించిన సేవలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అసోసియేట్ సభ్యత్వానికి ఒకేసారి రూ.10,000 రుసుము నిర్ణయించారు. సభ్యత్వం తీసుకునే మహిళా పారిశ్రామికవేత్తలు, 30 ఏళ్లలోపు పారిశ్రామికవేత్తలకు అదనంగా ఒక కాంప్లిమెంటరీ సభ్యత్వం కల్పించనున్నట్లు ప్రకటించారు.

## వ్యాపారవేత్తలకు అండగా నిలుస్తాం

సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ జస్టిస్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలనుకునే వారికి అవసరమైన సహకారం అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

సంస్థ ముఖ్య నిర్వాహకుడు టీవీఎన్ రావు మాట్లాడుతూ, వ్యాపార, వాణిజ్య అవకాశాలకు దూరంగా ఉన్న సామాజిక వర్గాలకు అవకాశాలు కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపార భాగస్వామ్యాలను ఏర్పాటు చేయడం, కొత్త మార్కెట్లను అన్వేషించడం, వ్యాపార నెట్‌వర్క్‌ను విస్తరించడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని వివరించారు. దక్షిణ భారతదేశంలోని వివిధ సామాజిక వర్గాల పారిశ్రామికవేత్తలకు ఈ వేదిక కొత్త అవకాశాలను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తోట చంద్రశేఖర్ మాట్లాడుతూ, నూతన పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు సమాఖ్య మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు. అమెరికాలో పారిశ్రామికవేత్తగా స్థిరపడిన రజినీకాంత్ మాట్లాడుతూ, యువత పట్టుదలతో ముందుకు వచ్చి వ్యాపార, వాణిజ్య అవకాశాలను అందిపుచ్చుకోవాలని, సమాఖ్య అందించే సహాయ సహకారాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

## కేంద్ర మంత్రులతో SCC ప్రతినిధుల భేటీ

సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు అక్టోబర్ 5, 6 తేదీల్లో న్యూఢిల్లీలో పర్యటించి పలువురు కేంద్ర మంత్రులు, సహాయ మంత్రులను కలిశారు. ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ సహకారంతో జరిగిన ఈ సమావేశాల్లో సంస్థ లక్ష్యాలు, కార్యకలాపాలను వివరించి వ్యాపారవేత్తలకు ప్రభుత్వ పథకాల ద్వారా సహకారం అందించాలని కోరినట్లు సంస్థ తెలిపింది. ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సహాయం, ఎస్‌బీఐ, సిడ్బీ రుణ పథకాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, గిడ్డంగులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, రైల్వే సంబంధిత వ్యాపారాలు, గ్రామీణాభివృద్ధి పథకాలపై మార్గదర్శకత్వం, సహకారం అందించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

మీడియా సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు టీవీఎన్ రావు, పీవీ రావు, ఏవీ రత్నం, తోట చంద్రశేఖర్, సంఘాని రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు. వ్యాపార ఆలోచనలను పెట్టుబడులతో, పరిశ్రమలను నూతన ఆవిష్కరణలతో, పారిశ్రామికవేత్తలను జాతీయ, అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వేదికగా గ్లోబల్ బిజినెస్ మీట్‌ను తీర్చిదిద్దాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

# మహిళల ఆరోగ్యమే కుటుంబానికి బలం!

## నెలసరి నుంచి మెనోపాజ్ వరకు..
## ప్రతి దశలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

## సీనియర్ గైనకాలజిస్ట్
## డాక్టర్ స్వాతి చక్రవర్తి సూచనలు

నాగారం, అక్టోబర్ 10:-(వాయిస్ టుడే): మహిళ అంటే కుటుంబానికి ఆధారం. ఇంట్లో అందరి ఆరోగ్యాన్ని చూసుకునే మహిళలు, తమ ఆరోగ్యం విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా ఉండటం తరచుగా కనిపిస్తుంది. నెలసరి సమస్యలు వచ్చినా, తీవ్రమైన కడుపునొప్పి ఉన్నా, హార్మోన్లలో మార్పులు వచ్చినా వాటిని సాధారణ సమస్యలుగా భావించి చాలామంది వైద్యులను సంప్రదించడంలో ఆలస్యం చేస్తుంటారు. కానీ మహిళల ఆరోగ్యం అంటే కేవలం గర్భధారణ, ప్రసవం మాత్రమే కాదు. కౌమార దశ నుంచి మధ్య వయస్సు, మెనోపాజ్ వరకు ప్రతి దశలోనూ శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఈ మార్పులపై అవగాహన కలిగి ఉండటం, అవసరమైనప్పుడు వైద్య సలహా తీసుకోవడం ఎంతో ముఖ్యం. మహిళల ఆరోగ్య సంరక్షణలో 25 ఏళ్లకు పైగా అనుభవం కలిగిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ స్వాతి చక్రవర్తి సూచనల ప్రకారం... మహిళలు తమ ఆరోగ్యానికి కూడా కుటుంబ సభ్యుల ఆరోగ్యంతో సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.

### నెలసరి సమస్యలను తేలిగ్గా తీసుకోవద్దు,

నెలసరి సక్రమంగా రాకపోవడం, అధిక రక్తస్రావం, తీవ్రమైన కడుపునొప్పి, నెలసరి మధ్య ఎక్కువ విరామం ఉండటం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి కొన్నిసార్లు హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ సమస్యలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు సంకేతాలు కావచ్చు. ప్రతి మహిళలో నెలసరి చక్రం ఒకేలా ఉండకపోవచ్చు. అయితే సాధారణంగా ఉండే విధానంలో గణనీయమైన మార్పులు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించడం మంచిది. ముఖ్యంగా అధిక రక్తస్రావం, భరించలేని నొప్పి లేదా నిరంతర సమస్యలు ఉంటే వైద్య పరీక్షలు అవసరం.

### పీసీఓఎస్ అంటే ఏమిటి...?

ప్రస్తుతం అనేక మంది యువతులు, మహిళల్లో కనిపిస్తున్న సమస్యల్లో పీసీఓఎస్ ఒకటి. ఇది హార్మోన్లతో పాటు శరీర జీవక్రియపై కూడా ప్రభావం చూపగల ఆరోగ్య పరిస్థితి. నెలసరి క్రమం తప్పడం, మొటిమలు ఎక్కువగా రావడం, ముఖంపై అవాంఛిత రోమాలు పెరగడం, అండోత్పత్తిలో సమస్యలు ఇవంటి లక్షణాలు కనిపించవచ్చు. అధిక బరువు ఉన్నవారికే పీసీఓఎస్ వస్తుందనుకోవడం పొరపాటు. సాధారణ బరువు ఉన్న మహిళల్లో కూడా ఈ సమస్య ఉండవచ్చు.



పీసీఓఎస్ ఉన్న ప్రతి మహిళకు ఒకే రకమైన చికిత్స అవసరం ఉండదు. లక్షణాలు, ఆరోగ్య పరిస్థితులను బట్టి వైద్యులు తగిన పరీక్షలు సూచించి, అవసరమైన చికిత్సను నిర్ణయిస్తారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన వ్యాయామం, తగిన నిద్ర కూడా ఆరోగ్య నిర్వహణలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. తల్లి కావాలనుకునేవారు ముందుగానే సిద్ధం కావాలి. గర్భధారణ అనేది మహిళ జీవితంలో ముఖ్యమైన దశ. ఆరోగ్యకరమైన గర్భధారణ కోసం గర్భం దాల్చే ముందే వైద్య సలహా తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, పోషకాహారంపై శ్రద్ధ చూపడం ఉపయోగకరంగా ఉంటుంది. గర్భం దాల్చిన తర్వాత క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని పర్యవేక్షించవచ్చు. వైద్యుల సూచనల ప్రకారం మందులు, పోషక పదార్థాలు తీసుకోవడం కూడా ముఖ్యం. సంతానలేమి సమస్యలు ఎదురైతే ఆందోళన చెందకుండా నిపుణులను సంప్రదించాలి. అవసరమైనప్పుడు భార్యాభర్తలిద్దరికీ వైద్య పరీక్షలు చేయడం ద్వారా సమస్యకు కారణాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. సంతానలేమికి మహిళ ఒక్కరే కారణమని భావించడం సరైంది కాదు.

### మెనోపాజ్.. సహజమైన మార్పు

సాధారణంగా మధ్య వయస్సులో మహిళలు మెనోపాజ్ దశకు చేరుకుంటారు. ఈ సమయంలో నెలసరి శాశ్వతంగా ఆగిపోవడానికి ముందు, ఆ తర్వాత కూడా శరీరంలో హార్మోన్ల మార్పుల వల్ల కొన్ని లక్షణాలు కనిపించవచ్చు. వేడి ఆవిర్లు, రాత్రిపూట చెమటలు, నిద్రలేమి, మానసిక స్థితిలో మార్పులు వంటి సమస్యలు కొందరిని ఇబ్బంది పెట్టవచ్చు. ఈ లక్షణాలు రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తే వాటిని భరిస్తూ ఉండకుండా వైద్య సలహా తీసుకోవాలి.

ఈ దశలో ఎముకల ఆరోగ్యం, గుండె ఆరోగ్యం, పోషకాహారం, శారీరక చురుకుదనం వంటి అంశాలపై కూడా తగిన శ్రద్ధ చూపాలి. ప్రతి మహిళ అనుభవం భిన్నంగా ఉంటుంది కాబట్టి, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్య సలహా తీసుకోవడం మంచిది. మహిళలు గుర్తుంచుకోవాల్సిన ఐదు విషయాలు...

**నెలసరి సమస్యలు, తీవ్రమైన నొప్పి లేదా అసాధారణ రక్తస్రావాన్ని నిర్లక్ష్యం చేయవద్దు.**

**వైద్యుల సలహా లేకుండా హార్మోన్ల మందులు లేదా ఇతర మందులు వాడవద్దు.**

**ఆరోగ్యకరమైన ఆహారం, క్రమమైన వ్యాయామం, తగిన నిద్రకు ప్రాధాన్యత ఇవ్వండి.**

**గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోండి.**

**మెనోపాజ్ సమయంలో ఇబ్బందికరమైన లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించండి.**

**మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది.**

**మహిళల ఆరోగ్య సమస్యలపై సమాజంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. శరీరంలో వచ్చే మార్పుల గురించి బహిరంగంగా మాట్లాడే వాతావరణం ఉండాలి. సంకోచం, అపోహలు, భయం కారణంగా వైద్య సహాయం పొందడంలో ఆలస్యం చేయకూడదు.**

డాక్టర్ స్వాతి చక్రవర్తి సూచించే ముఖ్యమైన సందేశం ఒక్కటే --- మహిళలు తమ ఆరోగ్యాన్ని చివరి ప్రాధాన్యతగా చూడకూడదు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంతో పాటు తమ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి.

గుర్తుంచుకోండి: మహిళల ఆరోగ్యం గర్భధారణకే పరిమితం కాదు. జీవితంలోని ప్రతి దశలో ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది అన్నారు.

# న్యాయవాది కాసింశెట్టి కరుణాసాగర్‌కు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలి

**కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మున్నూరుకాపు నేతల వినతి**



హైదరాబాద్ :అక్టోబర్ 10(వాయిస్ టుడే) తెలంగాణలో రాష్ట్రంలో త్వరలో జరగనున్న హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా న్యాయవాది కాసింశెట్టి కరుణాసాగర్‌కు అవకాశం కల్పించాలని పలువురు మున్నూరుకాపు సంఘాల నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు కరీంనగర్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ న్యాయవాదుల ఫోరం అధ్యక్షుడు, మున్నూరుకాపు మహాసభ ఉపాధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, మహాసభ మాజీ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు, సీనియర్ బీజేపీ నాయకుడు, మున్నూరుకాపు అపెక్స్ కమిటీ కన్వీనర్ మీసాల చంద్రయ్య, తెలంగాణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు తదితరులు ఈ వినతిని సమర్పించారు.

కరుణాసాగర్ విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగా పనిచేశారని, అనంతరం గ్రేటర్ హైదరాబాద్ బీజేపీ లీగల్ సెల్ కన్వీనర్‌గా సేవలందించారని నాయకులు పేర్కొన్నారు. బీజేపీ అధికార ప్రతినిధిగా టీవీ చర్చల్లో పాల్గొన్నారని, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీపై క్రిమినల్ కోర్టులో కేసు దాఖలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు. పార్టీ, న్యాయవాద వృత్తి, సామాజిక రంగాల్లో కరుణాసాగర్‌కు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బండి సంజయ్‌ను కోరినట్లు నాయకులు తెలిపారు.



# బీజేపీ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ బీసీలకే కేటాయించాలి

**కుంట్లూరు వెంకటేష్ గౌడ్**

నాంపల్లి : అక్టోబర్ 10 (వాయిస్ టుడే): హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం బీసీ అభ్యర్థికి కల్పించాలని కోరుతూ తెలంగాణ ఉద్యమ కారుడు , బీజేపీ సీనియర్ నాయకుడు కుంట్లూరు వెంకటేష్ గౌడ్ నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎంజే మార్కెట్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి ఎమ్మెల్సీ టికెట్‌ను తనకే కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుంట్లూరు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు టికెట్లు కేటాయించాయని పేర్కొన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ బీజేపీ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించాలని కోరారు. బీసీ అభ్యర్థికి టికెట్ కేటాయిస్తే పట్టభద్రుల మద్దతుతో విజయం సాధించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో అన్ని పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని వెంకటేష్ గౌడ్ కోరారు. హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించడం ద్వారా బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చినట్లవుతుందని అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావును కలిసి తమ అభ్యర్థనను వివరించినట్లు వెంకటేష్ గౌడ్ తెలిపారు. పార్టీ నాయకత్వం తమ విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి బీసీ అభ్యర్థికి అవకాశం కల్పిస్తుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. విద్యావంతులందరూ కూడా ప్రధాని మోడీ వైపు చూస్తున్నారని ఆయన అన్నారు. ఫస్ట్ దేశం , నెక్స్ట్ ఫ్యామిలీ అని పిలుపునిచ్చిన మోడీ వైపే యువత చూస్తున్నారని పేర్కొన్నారు. దేశానికి మోడీ శ్రీరామరక్షని ప్రజలు నమ్ముతున్నారని వెంకటేష్ గౌడ్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో అమిత్ షా, మోడీ ఆధ్వర్యంలో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

# కీసరలో చైన్ స్నాచింగ్.. వృద్ధురాలి మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు అపహరణ

**నాగారం అన్నపూర్ణ కాలనీలో ఘటన..**



నాగారం, అక్టోబర్ 10:-(వాయిస్ టుడే) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారం అన్నపూర్ణ కాలనీలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. శనివారం శకుంతల (68) అనే వృద్ధురాలు తన కుమార్తె ఇంటికి వెళ్లేందుకు వస్తువులు సర్దుకుంటుండగా, వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు బాధితురాలు తెలిపింది. సమాచారం అందుకున్న కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాలనీల్లో నిఘా పెంచి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

VOICE OF PRAJALU
వాయిస్
ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
ఆదివారం 11 అక్టోబరు 2026

## సంగీత విద్వాంసుడు ఎజ్రా శాస్త్రి మృతి



నాచారం (వాయిస్ టుడే): గాత్ర వాయిద్య సంగీత విద్వాంసుడు ఎజ్రా శాస్త్రి (72) శుక్రవారం అర్ధరాత్రి సికింద్రాబాద్ ఫాలోమి ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన మృతి తనను ఎంతో కలిసివేసిందని తెలుగు క్రైస్తవ సాహితీ సమితి అధ్యక్షులు జెట్టి ఏ అలివర్ అన్నారు. ఆయన మృతి సంగీత ప్రియులకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఎజ్రా శాస్త్రి గాయకుడిగా, వాయిద్య సంగీతం నిపుణిడిగా, గాన రచయితగా, రాగ తాళ కర్తగా తెలుగు క్రైస్తవ సంఘాలకు ఆయన ఎన్నో సంవత్సరాలుగా ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. అక్టోబర్ 11 (నేడు ఆదివారం) మధ్యాహ్నం రెండు గంటలకు బాపిస్ట సెంటినరీ మహా దేవాలయం సికింద్రాబాద్ లో అంతక్రియల ఆరాధన అనంతరం సంపూర్ణ సంఘ గౌరవాలతో సికింద్రాబాద్ లోని క్రైస్తవ సమాధుల స్థలంలో భూస్థాపన జరుగుతుందని ఎజ్రా శాస్త్రి ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ఏసుప్రభు మనోధైర్యం ఇవ్వాలని జెట్టి ఏ అలివర్ కోరుకున్నారు.

## మల్కారం క్వారీలో విషాదం.. నీట మునిగి ఇంటర్ విద్యార్థి మృతి

### దమ్మాయిగూడకు చెందిన 17 ఏళ్ల యువకుడు మృత్యువాత



నాగారం, అక్టోబర్ 10:-(వాయిస్ టుడే) మల్కారం క్వారీలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లాలోని కీసర మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. దమ్మాయిగూడ సాయిప్రియ కాలనీకి చెందిన ముమ్మారెడ్డి ప్రణవ్ సాయి (17) చేర్యాలలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటిలాగే అక్టోబర్ 9న కళాశాలకు వెళ్లిన ప్రణవ్ సాయి సాయంత్రం స్నేహితులతో కలిసి మల్కారం క్వారీ వద్దకు ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడు నీటిలో మునిగిపోయాడు. సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ప్రణవ్ సాయి తల్లి హేమలతకు అతడి స్నేహితులు, పోలీసులు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్నేహితులను విచారించగా, అందరూ కలిసి ఈత కొడుతున్న సమయంలో ప్రణవ్ సాయి నీటిలో మునిగిపోయినట్లు తెలిపారు. పోలీసులు, రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపట్టి నీటిలో నుంచి ప్రణవ్ సాయి మృతదేహాన్ని వెలికితీశారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు గుర్తించారు. ఘటనపై తల్లి హేమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



## శ్రద్ధ కళాశాలలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు

### అతిథులను ఘనంగా సన్మానించిన కళాశాల చైర్మన్ ఎం.డి. మధార్

నాచారం (వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను కీసరలోని శ్రద్ధ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో బతుకమ్మను అందంగా పేర్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూల పండుగ వేడుకలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కీసర డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ ఎం.డి. మధార్ అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం అతిథులు బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనం గురించి వివరించారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పూల పండుగ అని, మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలను విద్యా సంస్థల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.కళాశాలలో ప్రతి పండుగను సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతున్న యాజమాన్యాన్ని అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. విద్యతోపాటు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యతనివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపగా, విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## శివ సాయి హిల్స్ సమస్యకు రూ. 37 లక్షలు మంజూరు

### - కొలన్ హన్మంత్ రెడ్డికి కాలనీ కమిటీ కృతజ్ఞతలు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 277వ డివిజన్ మహదేవపురం పరిధిలోని శివ సాయి హిల్స్ కాలనీలో గత నాలుగేళ్లుగా స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూ జి డి ) సమస్య పరిష్కారం దిశగా ముందడుగు పడింది. ఈ సమస్య పరిష్కారానికి సంబంధించి రూ. 37 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ సమస్యను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సంబంధిత అధికారులతో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడి, ఈడీ గారి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను పరిశీలించేలా చొరవ తీసుకున్నారు.అనంతరం యూ జి డి పనులకు సంబంధించి సాంక్షన్ ఆర్డర్ జారీ అయింది. సుమారు 10 రోజుల క్రితం సాంక్షన్ ఆర్డర్ జారీ కాగా, రాబోయే 15--20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపినట్లు కాలనీ కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులందరూ కొలన్ హన్మంత్ రెడ్డి కలిసి, తమ కాలనీలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న యూ. జి.డి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమస్య పరిష్కారం దిశగా చర్యలు ప్రారంభం కావడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శివ సాయి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 70 ఏళ్ల తర్వాత మోకాలి మార్పిడి శస్త్రచికిత్స సాధ్యమేనా...?

**వయసు ఒక్కటే అడ్డంకి కాదు..
ఆరోగ్య పరిస్థితి,
శారీరక సామర్థ్యమే కీలకం**

**డాక్టర్. టి చిరంచీవి థాయీ, సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోప్లాస్టీ అండ్ జాయింట్ రిప్లేస్ మెంట్ సర్జన్,
కిమ్స్, సన్ సైన్ హాస్పిటల్స్...**




నాగారం, అక్టోబర్ 10:-(వాయిస్ టుడే)బీ వయసు పెరుగుతున్న కొద్దీ మోకాళ్ల నొప్పులు, కీళ్ల అరుగుదల సమస్యలు చాలామందిని వేధిస్తుంటాయి. ముఖ్యంగా 70 ఏళ్లు దాటినవారిలో నడవడం, మెట్లు ఎక్కడం, కుర్చీలో నుంచి లేవడం వంటి రోజువారీ పనులు కూడా కష్టంగా మారవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకోవచ్చా అనే అంశాలపై కిమ్స్, సన్ సైన్ హాస్పిటల్ డాక్టర్ టి చిరంజీవి థాయీ, సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోప్లాస్టీ అండ్ జాయింట్ రిప్లేస్ మెంట్ సర్జన్ తెలిపారు. వయస్సు ఎక్కువగా ఉండటం వల్ల శస్త్రచికిత్స ప్రమాదకరమవుతుందా? అనే సందేహాలు చాలామందిలో ఉంటాయి. వయస్సు ఒక్కటే శస్త్రచికిత్సకు అర్హతను నిర్ణయించదు. రోగి మొత్తం ఆరోగ్య పరిస్థితి, ఇతర అనారోగ్య సమస్యలు, శారీరక సామర్థ్యం, నొప్పి తీవ్రత, రోజువారీ జీవనంపై సమస్య ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే వైద్యులు తగిన చికిత్సను సూచిస్తారు. మోకాలి నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు..

మోకాలి కీళ్లలోని మృదులాస్థి క్రమంగా అరిగిపోవడం వల్ల ఆస్టియో ఆర్థరైటిస్ సమస్య ఏర్పడవచ్చు. దీనివల్ల నొప్పి, వాపు, కీళ్ల బిగుతు, నడవడంలో ఇబ్బందులు కలగవచ్చు. ప్రారంభ దశల్లో వైద్యుల సూచనల మేరకు వ్యాయామాలు, ఫిజియోథెరపీ, బరువు నియంత్రణ, మందులు వంటి చికిత్సా విధానాలతో ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది.

అయితే నొప్పి తీవ్రంగా ఉండి, రోజువారీ పనులు చేయలేకపోవడం, నడక గణనీయంగా తగ్గిపోవడం, ఇతర చికిత్సలతో తగిన ఉపశమనం లభించకపోవడం వంటి పరిస్థితుల్లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు పరిశీలించవచ్చు.

### శస్త్రచికిత్సకు ముందు ఏ పరీక్షలు అవసరం...?

వృద్ధుల్లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను పరిగణనలోకి తీసుకునే ముందు గుండె, ఊపిరితిత్తుల ఆరోగ్యం, మధుమేహం, రక్తపోటు, మూత్రపిండాల పనితీరు, ప్రస్తుతం వాడుతున్న మందులు వంటి అంశాలను అంచనా వేయడం ముఖ్యం. రోగి కండరాల బలం, నడిచే సామర్థ్యం, శస్త్రచికిత్స తర్వాత ఫిజియోథెరపీ చేయగల పరిస్థితి కూడా పరిశీలించాలి. వయసు ఎక్కువగా ఉన్న ప్రతి ఒక్కరికీ శస్త్రచికిత్స అవసరం ఉండదు. అలాగే 70 ఏళ్లు దాటినంత మాత్రాన శస్త్రచికిత్స చేయించుకోలేరని భావించడం కూడా సరైంది కాదు. ప్రతి రోగి పరిస్థితిని బట్టి ప్రయోజనాలు, ప్రమాదాలను వైద్యులు వివరించి నిర్ణయం తీసుకోవాలి.

### శస్త్రచికిత్స తర్వాత కోలుకోవడం ఎలా ఉంటుంది..?

మోకాలి మార్పిడి శస్త్రచికిత్స తర్వాత కోలుకునే వేగం ప్రతి ఒక్కరిలో ఒకేలా ఉండదు. రోగి ఆరోగ్య పరిస్థితి, కండరాల బలం, శస్త్రచికిత్సకు ముందు ఉన్న చలన సామర్థ్యం, నొప్పి నియంత్రణ, ఫిజియోథెరపీపై ఆధారపడి కోలుకునే ప్రక్రియ మారుతుంది.

వైద్యుల పర్యవేక్షణలో క్రమంగా కదలికలు ప్రారంభించడం, సూచించిన వ్యాయామాలు చేయడం, పడిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం కీలకం. శస్త్రచికిత్స తర్వాత ఎంతవరకు నడవగలరు, ఎలాంటి పనులు చేయవచ్చు అనే విషయాలపై వ్యక్తిగతంగా వైద్యుల సూచనలు పాటించాలి. భయంతో చికిత్సను వాయిదా వేయొద్దు.

మోకాళ్ల నొప్పుల కారణంగా కదలికలు తగ్గిపోతే శారీరక స్వతంత్రతతో పాటు జీవన నాణ్యత కూడా ప్రభావితమవుతుంది. అందువల్ల వయసును మాత్రమే దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోకుండా, ఆర్థోపెడిక్ నిపుణుడిని సంప్రదించి అందుబాటులో ఉన్న చికిత్సా మార్గాలను తెలుసుకోవాలి. సరైన వైద్య మూల్యాంకనం ఆధారంగా తీసుకున్న నిర్ణయం రోగి అవసరాలకు అనుగుణమైన చికిత్సను ఎంచుకోవడంలో సహాయ పడుతుందని డాక్టర్. టి. చిరంజీవి థాయీ సీనియర్ కన్సల్టెంట్ ఆర్థ్రోప్లాస్టీ అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, కిమ్స్, సన్ సైన్ హాస్పిటల్ తెలిపారు.



## నవ్య, నిత్య పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ: ఉపాధ్యాయులు

హైదరాబాద్ : అక్టోబర్ 10: బాగ్ అంబర్‌పేట్‌లో నవ్య, నిత్య పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రేపటి నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఒకరోజు ముందుగానే విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకలను జరుపుకున్నారు. నవ్య విద్యాసంస్థల చైర్మన్ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థులు, ఉపాధ్యాయుల ఉత్సాహం మధ్య సందడిగా సాగాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ప్రేమకు, పూల వైవిధ్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు వాటి గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేయడం ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పండుగల ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సోదరభావం, ప్రకృతి పట్ల ప్రేమ, సామాజిక బాధ్యత వంటి విలువలు పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మన పండుగలు, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, తెలంగాణ సంస్కృతి వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు. నవ్య, నిత్య పాఠశాలల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపాయి. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ రామదేవి ఉపాధ్యాయులు మాలతి,రజిని, జ్యోతి,కవిత,మౌనిక ,వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గంధంతో విద్యార్థినులకు, డబుల్ బెడ్ రూమ్ వాసులకు ఇబ్బంది మారిన డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి

### అధికారులను ఆదేశించిన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే): సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ లోని నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ సముదాయాల సమీపంలో సుమారు 4 ఎకరాల్లో సువిశాల 42 గదులతో అన్నీ రకాల వసతులతో నూతనంగా నిర్మిస్తున్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల పనులను, అక్కడి వసతులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన కళాశాలకు ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉండడంవల్ల ఇక్కడ విద్యను అభ్యసించే విద్యార్థినులు తీవ్ర చెత్త దుర్గంధంతో ఇబ్బంది పడతున్నారని, వెంటనే ఇక్కడి నుంచి డంపింగ్ యార్డు తరలించాలని కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ఎమ్మెల్యే కోరగా ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి విద్యార్థినుల చదువుకు, డబుల్ బెడ్ రూమ్ వాసుల సముదాయాలకు దుర్వాసనతో ఇబ్బంది కరంగా మారిన ఈ డంపింగ్ యార్డ్ ను వెంటనే ఇక్కడ నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఈ డబ్ల్యుఎస్ డీఈఈ సంధ్యా రాణి, ఏఈ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.స్రవంతి, డిగ్రీ లెక్చరర్లు బి.నూతన, సుచరిత, సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ శానిటేషన్ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కీసర శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**తెలంగాణ సంస్కృతి,
సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు**

**కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు
రామిడి స్వప్న విజయ్ రెడ్డి**




నాగారం, అక్టోబర్ 10:-(వాయిస్ టుడే) మేడ్చల్ జిల్లా : కీసర డివిజన్--01 పరిధిలోని శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా ఘనంగా ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులు, కళాశాల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కీసర డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రామిడి స్వప్న విజయ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల ఎం.డీ. మదర్, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు వేడుకల్లో భాగస్వాములయ్యారు. పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థినులు సందడి చేస్తూ తెలంగాణ సంప్రదాయాల గొప్పతనాన్ని చాటారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన జీవన విధానానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పండుగ ప్రాముఖ్యతను చాటిచెప్పేలా వేడుకలు సాగాయి. సంప్రదాయ పండుగలను విద్యాసంస్థల్లో నిర్వహించడం ద్వారా విద్యార్థులకు తెలంగాణ సంస్కృతి, వారసత్వం పట్ల అవగాహన పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావం, సామూహిక స్ఫూర్తి బలపడతాయని కార్యక్రమం ద్వారా తెలియజేశారు. కళాశాల ప్రాంగణమంతా పూల పరిమళాలు, విద్యార్థినుల సందడి, బతుకమ్మ పాటలతో పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సందేశంతో శ్రద్ధ స్ఫూర్తి కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా ఎంగిలి పువ్వు బతుకమ్మ సంబరాలు ప్రారంభించారు.




# ఓరుగల్లు శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం

**అమ్మవారి 'పూలంగిసేవ' నిర్వహణ మా అదృష్టం :ఎంపీ రవిచంద్ర**

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 10: ఓరుగల్లు శ్రీ భద్రకాళిదేవి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నుండి ప్రారంభం కానున్న సందర్భంగా బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర -విజయలక్ష్మి దంపతులను వారి కుమారుడు కోడలు వద్దిరాజు సాయి నిఖిల్ చంద్ర- అనిలా దంపతులను,మరియు సోదరులు వద్దిరాజు కిషన్-శశిరేఖ, వద్దిరాజు దేవేందర్- ఇందిరా,వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమామహేశ్వరి దంపతులను దేవి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా విచ్చేయవలసిందిగా కోరుతూ శనివారం వారి నివాసంలో శాలువాతో సత్కరించి అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థ ప్రసాదాలను అందించిన దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత. భద్రకాళి దేవాలయం ప్రధాన అర్చకులు శేషు ఆహ్వానం పలకడం జరిగింది. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ నవరాత్రులు సందర్భంగా అమ్మవారికి అలాగే అమ్మవారి శేష వాహనములకు ఉదయం సాయంత్రం 'పూలంగిసేవ' చేసుకునే భాగ్యం తమ కుటుంబానికి కలగడం అమ్మవారు మాకిచ్చిన అదృష్టంగా భావిస్తున్నామనీ అన్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వివిధ రూపల్లో కొలువుతీరే అమ్మవారిని,శేష వాహనములను వివిధ రకాల పుష్పములచే గజమాలలతో సర్వాంగ సుందరముగా అలంకరింపచేసి అంగరంగ వైభవంగా వేదుక నిర్వహిస్తాము కావున భక్తులందరూ ప్రతిరోజు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులై తీర్థప్రసాదములు స్వీకరించగలరని కోరినారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అరవిండ్ శర్మ, భరద్వాజ్ శర్మ, ఆలయ సిబ్బంది సూపరింటెంటెడెంట్ కూచన హరినాథ్, నాగులు పాల్గొన్నారు..

**హనుమద్గిరి పద్మాక్షి దేవి నవరాత్రి ఉత్సవాలకు ఎంపీ రవిచంద్రకు ఆహ్వానం**

హనుమద్గిరి పద్మాక్షిని ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తున్న బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నివాసానికి విచ్చేసిన ఆలయ అర్చకులు నాగిళ్ల షణ్ముఖ శర్మ అయ్యగారు అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు కుటుంబ సమేతంగా రావాల్సిందిగా కోరుతూ అమ్మవారి ఆహ్వాన పత్రికతో పాటు తీర్థప్రసాదాలు అందించడం జరిగింది..

**ఎంగిలిపూల బతుకమ్మను పురస్కరించుకొని భువన గిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ బతుకమ్మతో సంబరాలలో పాల్గొన్న దృశ్యం. ఈ సందర్భంగా పట్టణ మహిళా మణులకు భువనగిరి మున్సిపల్ ప్రథమ పౌరురాలు తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.**



- యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి



**యాదగిరిగుట్ట లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యుల దృశ్యం.**

- యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి



## శ్రీ మణికంఠ నగర్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**బతుకమ్మ పాటలు పాడుతూ మహిళల సందడి**

హైద్రాబాద్ (వాయిస్ టుడే): చెంగిచెర్ల శ్రీ మణికంఠ నగర్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో శ్రీ మణికంఠ కాలనీవాసులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎం.డి. నయీమ్‌కు తూము వినయ్ కుమార్ అభినందనలు



కూకట్‌పల్లి: అక్టోబర్ 10(వాయిస్ టుడే): మైనారిటీ కాంగ్రెస్ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఎం.డి. నయీమ్‌ను తెలంగాణ ఓబీసీ వర్కింగ్ చైర్మన్ తూము వినయ్ కుమార్ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నయీమ్ మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.



## నాచారం హెచ్‌ఎంటీ నగర్ డివిజన్‌లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ, ఇంద్రనగర్ కాలనీల్లో మహిళల సందడి**

నాచారం (వాయిస్ టుడే): హెచ్‌ఎంటీ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్, అన్నపూర్ణ కాలనీ, ఇంద్రనగర్ కాలనీల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. ప్రకృతి ప్రసాదించిన రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, వాటి చుట్టూ మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ పాల్గొన్నారు. ఆయనతో పాటు యోగేశ్వర్, రెడ్డి, రామకృష్ణ, సోమయ్య, శశిసాయి, గందమల్ల గోపి, రాజిరెడ్డి, రమేష్, సురేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు.



## వరంగల్ టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కొరకు మజ్దూర్ యూనియన్ పర్యటన

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 10: వరంగల్ కేంద్రంగా పని చేస్తున్న టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యల పరిష్కారం కొరకు మజ్దూర్ యూనియన్ కాజీపేట జనరల్ బ్రాంచ్ చైర్మన్, సిసియాస్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్,జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వరంగల్ బ్రాంచ్ సెక్రెటరీ యుగంధర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం పర్యటన చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు జజుజ ల ప్రమోషన్ పైన జరుగుతున్న జాప్యం అలాగే టికెట్ చేకింగ్ స్టాఫ్ రూముకు నార్త్ సైడ్ డోర్ ఏర్పాటు చేయాలనీ కోరారు వెంటనే మజ్దూర్ యూనియన్ నాయకులు వరంగల్ ూజు/ఔ/ఔెూ అఖిల్ తో మాట్లాడి డోర్ ఏర్పాటు పాటు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు వారు సానుకూలంగా స్పందించి త్వరలోనే పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేణు, హరీష్, పూర్ణ చందర్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు



## శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానం

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వహించే దుర్గాదేవి పూజా కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరుతూ ఆహ్వాన పత్రికలను అందజేశారు ఈ సందర్భంగా పలు కాలనీలకు చెందిన సభ్యులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన, కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులతో పాటు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



## 125వ డివిజన్ గాజులరామారం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు డి . విజయ్ రామ్ రెడ్డి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు.

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే )బీ 125వ డివిజన్ గాజులరామారం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, యువ నాయకులు డి . విజయ్ రామ్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, భౌరంపేట్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాచారం మురళీ యాదవ్ ఆయనతో కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.



## జీడిమెట్ల డిపో టీజీఎస్ ఆర్టీసీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన జాలిగం రాకేష్ అభినందించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే): జీడిమెట్ల డిపో టీజీఎస్ ఆర్టీసీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన బీఆర్ఎస్ నాయకులు జాలిగం రాకేష్ మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు శంభీపూర్‌లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జీడిమెట్ల డిపో టీజీఎస్ ఆర్టీసీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా విజయం సాధించిన జాలిగం రాకేష్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వారి పక్షాన నిలబడి, వారి హక్కుల పరిరక్షణకు అండగా ఉండాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సురేందర్ రెడ్డి, ధర్మ రెడ్డి, వెంకట్ రెడ్డి, పెప్సీ రాజు, సుదర్శన్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పలువురు బిఆర్ఎస్ నాయకుల జన్మదిన వేడుకలు

**ముఖ్య అతిథిగా హాజరైన బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 10(వాయిస్ టుడే)బీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని గాజుల రామారం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, జీడిమెట్ల డివిజన్ సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్ లు తమ పుట్టిన రోజు సందర్భంగా వారి కార్యాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు సుధాకర్ గౌడ్ లకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అంబులెన్స్ అసౌకర్యం....

**ప్రయివేట్ దవాఖాన కు అనుమతి లేదు....**

**ప్రభుత్వ దవాఖానలో డాక్టర్స్ లేరు....**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన నిజం...**




దంతాలపల్లి అక్టోబర్10(వాయిస్ టుడే):- దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనారోగ్యానికి గురై అంబులెన్స్ సహాయం కోరుతే వారు చేసిన అసమర్థత సహాయం అనుచిత సమాధానం వలన ఎంతో గోరమైన ఇబ్బందులకు గురయ్యామంటూ ఇలాంటి పరిస్థితి మరీ ఎవ్వరికి జరగ కూడదంటూ ఉన్నతాధికారుల ను కోరుకుంటూ ఆలస్యంగా నైనా తమ బాధను వాయిస్ టుడే కు విన్న వించుకున్నారు.బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన మేకల.రాంమూర్తి అనే వ్యక్తి గత నెల ఇరవై మూడో తేదీన రాత్రి సుమారు పది గంటల సమయంలో కడుపు నొప్పి లేసి అస్వస్థతకు గురవడంతో 108 కు కాల్ చేయడం జరిగిందని,ఫోన్ చేసిన కొద్ది సమయంలోనే అంబులెన్స్ పేషెంట్ దగ్గరకు చేరుకుని తనని తీసుకుని దగ్గరలో ఉన్న సబ్ డివిజన్ తొర్రూరు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కు తీసుకు వెళ్లి అక్కడ పేషెంట్ ను ఆసుపత్రిలో చేర్పించకుండా ప్రధాన ద్వారం(గెట్) దగ్గర వదిలి నిర్లక్ష్యంగా వెళుతున్న క్రమంలో పేషెంట్ తరుపున వచ్చిన వారు సర్ ఈ హాస్పిటల్ లో గేట్ తయ్యడం లేదుగా కాబట్టి దగ్గరలోని ఏదైన ప్రయివేటు హాస్పిటల్ లో చేర్పించి పొమ్మని కోరగా అంబులెన్స్ లోని డాక్టర్, డ్రైవర్ లు మాకు ఇంతవరకే పరిమితి ఉన్నది ప్రయివేటు హాస్పిటల్ తీసుకు వెళ్లే పరిమిషన్ లేదని చెప్పారని, అంబులెన్స్ వారిని ఎంతో ప్రాధేయపడుతూ ఈ రాత్రి వేళ ఇక్కడ వదిలి వెళ్ళిపోతే పేషేంట్ ప్రాణానికే ముప్పని, కాబట్టి మమ్మల్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చేర్పించమని కోరగా ఈ రాత్రి వేళ అక్కడ వైద్యులు ఉండరని చెప్పి ఎటుకాని చోట వదిలి వెళ్లి పోవడం తో ఎం చేయాలో అర్థం కాక విగత జీవులమై నివ్వరపోయామని కుటుంబ సభ్యులు తమ బాధను వ్యక్తం చేశారు.అనంతరం ఆరాత్రి వేళా వర్షం పడితున్న సమయంలో ఎలాంటి ప్రయివేటు వాహనాలు లేక పోవడంతో మా ఊరు కి ఫోన్ చేసి అక్కడి నుండి వెహికల్ వచ్చే అంతవరవేచి చూసి అటు తర్వాత ఓ ప్రయివేటు హాస్పిటల్ కు తీసుకు వెళ్లి చికిత్స చేయించమన్నారు. అంబులెన్స్ డ్రైవర్, వైద్యుడు నిర్లక్ష్యం వలన పేషేంట్ ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడని కుటుంబ సభ్యులు నిర్లిప్త గొంతుకతో అనుభవించిన బాధను వెలిబుచ్చారు. ఇప్పటికైనా ఇలాంటి సమస్యలు మరల లెవనెత్తకుండా ఉన్నత అధికారులు తగిన విధంగా చర్యలు చేపట్టి అంబులెన్స్ సిబ్బందికి తగిన విధంగా సూచనలు చేసి ప్రజల ప్రాణాలకు హాని కలగకుండా చూసుకునేలా చేయాలని ప్రభుత్వాన్ని,అధికార యంత్రాంగాన్ని కోరుతున్నామన్నారు.

## టిపిటిఎఫ్ తొర్రూరు మండలశాఖ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





తొర్రూరు, అక్టోబర్ 10 వాయిస్ టుడే : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) తొర్రూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం టిపిటిఎఫ్ భవన్‌లో మండల శాఖ అధ్యక్షులు కొండం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల శాఖ ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ గత రెండు సంవత్సరాల 25 రోజుల కాలంలో సంఘం నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన ఉద్యమాలు, సాధించిన విజయాలతో కూడిన కృషి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నెలకొన్న పరిస్థితులతో పాటు విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం సభ్యుల హర్షధ్వానాల మధ్య నివేదికను ఆమోదించారు. అనంతరం వచ్చే సంవత్సరానికి సంబంధించి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కమిటీ వివరాలు**

అధ్యక్షులు: కొండం జనార్ధన్ ప్రధాన కార్యదర్శి: కొలుపుల శ్రీనివాస్

ఉపాధ్యక్షులు: కే. అనంతరెడ్డి, పి. వెంకటేశ్వర్లు, కే. జ్యోతి, ఎండి యాకూబి.

కార్యదర్శులు: పి. శ్రీనివాస్, ఏ. జ్యోతి, బి. యాక మధు, ఎం. సోమేశ్వర్, కె హేమలత

జిల్లా కౌన్సిలర్లుగా ఎస్. ఉపేందర్ రెడ్డి, ఎం. సబిహా భాను, బి. సంపత్, బి. బాలు, కే. రమేష్.,

ఆడిట్ కమిటీ కన్వీనర్ గాబి. శ్రీనివాస్ అకాడమిక్ సెల్ కన్వీనర్ గా ఏ యాకయ్య.

జీఓల కమిటీ:-జె సతీష్. సోషల్ మీడియా కమిటీ: సి.హెచ్. స్వామి

కల్చరల్ కమిటీ: ఐ. కృష్ణ . ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కొండం జనార్ధన్, ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ మాట్లాడుతూ, రాబోయే కాలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగ అభివృద్ధికి, ప్రభుత్వ విద్యా పరిరక్షణకు సంఘం తరపున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలను నిర్వహిస్తూ, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు ఎన్నికల అధికారిగా పి రవీందర్ రెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా పి విష్ణువర్ధన్ రెడ్డి ,టి ప్రభాకర్ హాజరై తమ బాధ్యతలను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించిన వీరికి నూతన కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న గెజిటెడ్ హెడ్ మాస్టర్లు జెల్లా లక్ష్మీనారాయణ ,కే వీరన్న ,ఎస్ వీరస్వామి,ఎన్నికల అధికారులు నూతనంగా ఎన్నికైన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.




## మోడీ ప్రభుత్వ తీరు దుర్మార్గం

తొర్రూరు, అక్టోబర్ 10 వాయిస్ టుడే : అక్రమ పద్ధతుల్లో 13 కోట్ల భారతీయుల ఓట్లను తొలగించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ను రాజీనామా చేయించాలని ప్రజాస్వామ్య పద్ధతిలో నేడు ఢిల్లీలో నిరసన చేస్తున్న వారిపై మోడీ ప్రభుత్వ తీరు దుర్మార్గమని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముజంపల్లి వీరన్న అన్నారు. ఢిల్లీ లాఠీచార్జి కి నిరసనగా శనివారం తొర్రూరులోని గాంధీ విగ్రహం వద్ద మాస్ లైన్ ఆధ్వర్యంలో నల్లగుడ్డతో రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉద్దేశపూర్వకంగా కాలరాస్తున్న మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ హిట్లర్ బాటలో నడుస్తుందని అన్నారు. విద్యార్థులు, యువకులు, మేధావులు చివరికి సుప్రీంకోర్టు లాయర్స్ ను సైతం అరెస్టు చేయటం అన్యాయమన్నారు. శత్రు దేశాలతో పోరాడటానికి దేశ సరిహద్దుల్లో ఉండాల్సిన కేంద్ర బలగాలు ఢిల్లీ జంతర్ మంతర్ చుట్టూ కేంద్రీకరించటం భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని అన్నారు. అర్హులైన భారతీయ ఓట్లను తొలగించిన జ్ఞానేష్ కుమార్ ను దేశద్రోహిగా ప్రజలంతా నిరసిస్తుంటే మోడీ ప్రభుత్వం దొంగ నిద్రను నటిస్తుందని అన్నారు. ప్రపంచానికి స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం గురించి చెప్పే విశ్వ గురువు మోడీ తను అమలు చేస్తున్న ఈ నిర్బంధం సంగతేమిటని వారు ప్రశ్నించారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించి ఢిల్లీ నగర వీధులలో విధించిన ఆంక్షలు తొలగించి రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు. శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో జరుగుతున్న నిరసనను ఉద్రిక్తతలను పెంచి నిర్బంధాన్ని అమలు చేయాలని చూస్తే ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. ఇప్పటికే దేశంలో వివిధ ప్రాంతాలలో 50వేల మందిని అక్రమంగా అరెస్టు చేశారని వారందరినీ బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా నాయకులు శ్రీరాం పుల్లయ్య, మల్లికంటి వెంకన్న ,గుండాల సోమ నరసయ్య,మంగళపల్లి వెంకటకృష్ణ,లాక యాకన్న కందగట్ల వెంకన్న, రాము,ఎడ్ల ధర్మయ్య,పైన్ల శ్రీకాంత్,లక సంపత్,నాగరాజు తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు

**స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన రావు పద్మారెడ్డి**

హనుమకొండ, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను బీజేపీ రాష్ట్ర నాయకురాలు రావు పద్మారెడ్డి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని తన నివాసంలో కుటుంబ సభ్యులు, అపార్ట్‌మెంట్ మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహజసిద్ధమైన రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి, మహిళలతో కలిసి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావు పద్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులందరికీ ఎంగిలి పూల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు. గౌరమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కుటుంబసభ్యులు, అపార్ట్‌మెంట్‌మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.






## సీజేపీ నేతల అరెస్టులపై వరంగల్ నాయకుల ఖండన

**భోపాల్‌లో పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారని సీజేపీ నేతల ఆరోపణ**

**జ్ఞానేశ్వర్ రాజీనామా చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తాం**

**సీజేపీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు**

ఉమ్మడి వరంగల్, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): ఢిల్లీలో శాంతియుత నిరసనలో పాల్గొనేందుకు వెళ్తున్న తమ పార్టీ నేతలను మధ్యప్రదేశ్‌లోని భోపాల్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు ఆరోపించారు. ఈ ఘటనను వరంగల్‌కు చెందిన సీజేపీ నాయకులు ఖండించారు.

SIR ప్రక్రియలో జరిగినట్లు తాము పేర్కొంటున్న అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టినట్లు సీజేపీ నాయకులు తెలిపారు. ఈ క్రమంలో ఉత్తర తెలంగాణకు చెందిన పార్టీ నేతలను భోపాల్ ప్రాంతంలో పోలీసులు అడ్డుకున్నారని, రెండు రోజుల పాటు నిర్బంధంలో ఉంచి ఇబ్బందులకు గురిచేశారని వారు ఆరోపించారు. అనంతరం పోలీసుల పర్యవేక్షణలో తమ ప్రాంతాలకు పంపించారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుతో శాంతియుతంగా నిరసన తెలిపే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉందని సీజేపీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎన్ని నిర్బంధాలు, కేసులు ఎదురైనా జ్ఞానేశ్వర్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో తిరిగి వచ్చిన పార్టీ నేతలకు ఘనస్వాగతం పలికినట్లు తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సౌత్ జోన్ కోఆర్డినేటర్ స్టోన్లి కోరాని, రాష్ట్ర సభ్యులు రాజేష్ కొరపాక, రంగ సాయి రెడ్డి, శ్రీనిథ, గ్యారీ మాథ్యూస్, తరుణ్, భరత్, ప్రజ్వల్ నివాస్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌దే

**ప్రజల ముంగిటికే పాలన లక్ష్యంతోనే జిల్లాల పునర్వ్యవస్థీకరణ**

**బీఆర్ఎస్ పాలనలోనే సబ్బండ వర్గాలకు సముచిత గౌరవం**

**మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**



హనుమకొండ, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): తెలంగాణలో గతంలో ఉన్న పది జిల్లాలను 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించి పరిపాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నాయకుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేష్, చల్లా ధర్మారెడ్డి, డాక్టర్ తాటికొండ రాజయ్యలతో కలిసి వినయ్ భాస్కర్ సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సాధనలో అధికార వికేంద్రీకరణ కీలక ఆశయమని, ప్రజల ముంగిటికే పాలనను తీసుకురావాలనే లక్ష్యంతో కేసీఆర్ జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టారని పేర్కొన్నారు. మేధావులు, చరిత్రకారులు, ప్రజల అభిప్రాయాల మేరకు వరంగల్ అర్బన్ జిల్లాకు హనుమకొండగా పేరు పెట్టాలని ప్రతిపాదించగా, 2021లో హనుమకొండ జిల్లా ఏర్పాటైందని తెలిపారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యం, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవకాశం కలిగిందని, ఐటీ, ఉపాధి రంగాల్లోనూ హనుమకొండను అభివృద్ధి చేసేందుకు అప్పటి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో సబ్బండ వర్గాలకు సముచిత గౌరవం కల్పించామని వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం దెబ్బతిన్నాయని ఆయన విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలనా సంస్కరణలు చేపట్టిన గత ప్రభుత్వ విధానాలను ప్రజలు గుర్తిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూలవనాలుగా మారిన తెలంగాణ పల్లెలు

**తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా బతుకమ్మ వేడుకలు ప్రారంభం**

**- గడల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్**

తొర్రూరు , అక్టోబర్ 10 వాయిస్ టుడే : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా మహిళలంతా ఒక్కచోట చేరి ఘనంగా నిర్వహించుకునే బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు అత్యంత ఘనంగా సాంప్రదాయబద్ధంగా కొనసాగే బతుకమ్మ పండుగ ఉత్సవాలు శనివారం ఎంగిలిపూల బతుకమ్మవేడుకలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు గౌరమ్మ ఉయ్యాలో... ఈ బతుకమ్మ పాటలతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా బతుకమ్మ ఆటలు, పాటలతో మారుమోగాయి. తెలంగాణ ప్రాంత ప్రజలకు ప్రధానంగా తెలంగాణ మహిళలకు , ఆడపడుచులకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ వేడుకలు శనివారం నుండి ప్రారంభమయ్యాయి. తెలంగాణ వారసత్వానికి , సాంస్కృతి , సంప్రదాయాలకు ప్రధాన ఆకర్షణగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను ముందు తరాలకు అందిస్తూ తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాల్లో శనివారం ఎంగిలి పూల బతుకమ్మ కార్యక్రమంతో ఈ బతుకమ్మ పండుగ వేడుకలు అత్యంత ఘనంగా సాంప్రదాయబద్ధంగా మొదలయ్యాయి. మహాలయ అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో మొదలయ్యే ఈ బతుకమ్మ పండుగ వేడుకలు తొమ్మిది రోజులపాటు అత్యంత ఘనంగా కొనసాగి సద్దుల బతుకమ్మ వేడుకలతో ఘనంగా ముగుస్తాయి. తెలంగాణ ప్రాంతంలో మహిళలు బతుకమ్మ పండుగ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం గత కొన్ని తరాలుగా ఆనవాయితీగా వస్తున్నది.బతుకమ్మ సంబరాల్లో భాగంగా మహిళలు ప్రకృతిలో లభించే వివిధ రకాల తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అత్యంత సుందరంగా అలంకరించారు.శనివారం నుండి తొమ్మిది రోజులపాటు కొనసాగే బతుకమ్మ వేడుకల్లో భాగంగా గ్రామాల్లోని దేవాలయాలు, చెరువుల వద్ద మహిళలంతా పెద్ద సంఖ్యలో బతుకమ్మలు చేత పట్టుకుని బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి



చేశారు.బతుకమ్మ ఆటలు ఆడి పాటలు పాడిన అనంతరం తాము అందంగా అలంకరించి తీసుకువచ్చిన బతుకమ్మలను ఎంతో భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేసిన అనంతరం ఆనందోత్సాహాలతో ఇళ్ళకు చేరుకున్నారు. ఈ బతుకమ్మ పండుగ వేడుకలు తొమ్మిది రోజులు అత్యంత ఘనంగా సంప్రదాయబద్ధంగా కొనసాగిన అనంతరం ఈనెల 18 వ తేదీన జరిగే సద్దుల పండుగ వేడుకలతో ఈ ఏడాది బతుకమ్మ పండుగ వేడుకలు తెలంగాణ వ్యాప్తంగా అత్యంత ఘనంగా ముగుస్తాయి. బతుకమ్మ పండుగ సందర్భంగా శనివారం పట్టణాలు పల్లెల్లోని ప్రధాన రహదారులు పూల వ్యాపారులతో సందడిగా కనిపించాయి.

# సామాజిక సేవకు అంతర్జాతీయ గుర్తింపు

## పత్తెం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

## 26 ఏళ్ల సేవకు దక్కిన అరుదైన గౌరవం.. హర్షం వ్యక్తం చేస్తున్న మండల ప్రజలు

చిగురుమామిడి, అక్టోబర్ 10 (వాయిస్ ఆఫ్ ప్రజలు): సమాజ సేవే లక్ష్యంగా.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా గత 26 సంవత్సరాలుగా సామాజిక సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పత్తెం శ్రీనివాస్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన అందించిన సామాజిక సేవలు, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు చేసిన కృషి, సామాజిక చైతన్య కార్యక్రమాలకు గుర్తింపుగా యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ సంస్థ 'డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్' గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. చెన్నైలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు.

### 26 ఏళ్ల సామాజిక సేవకు గుర్తింపులి

సమాజ అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లోని అంతర్గత ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పత్తెం శ్రీనివాస్ చేపట్టిన కార్యక్రమాలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రకటించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యమిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల సుందరగిరి గ్రామంతో పాటు చిగురుమామిడి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




### ప్రముఖుల చేతుల మీదుగా పురస్కార ప్రదానం

చెన్నైలోని కృష్ణ గానసభ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ కే. వెంకటేశన్, జాయింట్ డైరెక్టర్ గౌని నరసింహ గౌడ్, ప్రపంచ శాంతి సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పర్వీందర్ సింగ్, డాక్టర్ స్వామి పద్మేంద్ర, అభిషేక్ పుష్కర్, తెలంగాణ యూఏయూ డిప్యూటీ డైరెక్టర్ కలరత్న డాక్టర్ కందుకూరి విజయమోహన్, డాక్టర్ వసంతి అజయ్ కుమార్, డాక్టర్ ఎం. రామచంద్రం, డాక్టర్ మదన్, ఏకే దయానంద్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ చాంబర్ ఆఫ్ కామర్స్ కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ టంగుటూరి తదితర ప్రముఖుల సమక్షంలో పత్తెం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు.

### సేవే నిజమైన గొప్పతనానికి కొలమానం

ఈ సందర్భంగా యూనివర్సిటీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ కే. వెంకటేశన్ మాట్లాడుతూ.. సమాజానికి అర్థవంతమైన సేవలు అందిస్తూ, మానవాళి అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తున్న విశిష్ట వ్యక్తులను గుర్తించి గౌరవించడం తమ సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. వ్యక్తుల గొప్పతనాన్ని కేవలం హోదాలు, పదవులతో కొలవలేమని, సేవాభావం, నిజాయితీ, నూతన ఆలోచనలు, ఇతరులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యమే నిజమైన గొప్పతనానికి నిదర్శనమని వివరించారు. సమాజంపై శాశ్వతమైన సానుకూల ప్రభావాన్ని చూపే వ్యక్తుల కృషిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మందిలో సేవా స్ఫూర్తిని పెంపొందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. నాయకత్వ లక్షణాలు, మానవతా విలువలు, సామాజిక బాధ్యతలను ప్రతిబింబించే వ్యక్తులకు అందించే ఈ గౌరవం.. సమాజ సేవకు ఒక ప్రోత్సాహకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

### మండల ప్రజల్లో హర్షాతిరేకాలు

ఒక గ్రామీణ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త తన 26 ఏళ్ల సేవా ప్రయాణంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పత్తెం శ్రీనివాస్‌కు గౌరవ డాక్టరేట్ లభించడంపై పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ గుర్తింపు ఆయన సేవా ప్రయాణంలో మరో మైలురాయిగా నిలవడంతో పాటు భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రేరణనిస్తుందని పలువురు ఆకాంక్షిస్తున్నారు.



## వెంకటాపూర్ చెరువులో మృతదేహాన్ని వెలికితీసిన ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

### –17వ పోలీస్ బెటాలియన్ సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం

సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట పోలీస్ స్టేషన్ పరిధి లోని వెంకటాపూర్ గ్రామ చెరువు లో మునిగి మృతి చెందిన మోతె కిరణ్ మృతదేహాన్ని 17వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ (రాణ=ఖీ) సిబ్బంది వెలికి తీశారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఉదయం 7:50 గంటలకు 17వ పోలీస్ బెటాలియన్ ఆర్ఎస్ఐ ఆర్. శేఖర్ నేతృత్వం లో 14 మంది పోలీస్ కానిస్టేబుళ్లు అవసరమైన రెస్క్యూ పరికరాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చెరువులో గాలింపు చర్యలు చేపట్టి మోతె కిరణ్ మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత పోలీసులకు అప్పగించారు. రెస్క్యూ ఆపరేషన్ ను పూర్తి చేసిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, రెస్క్యూ పరికరాలతో సురక్షితంగా బెటాలియన్ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నట్లు 17వ పోలీస్ బెటాలియన్ అధికారులు తెలిపారు.



## వివేకానంద కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): నగరంలోని వివేకానంద డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. హెచ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి,సంప్రదాయ దుస్తులు ధరించి తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు,ప్రకృతి ప్రేమకు,పూల వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ధనపురి సాగర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాత్రమే నిర్వహించే బతుకమ్మ వేడుకలు ప్రకృతిని ఆరాధిస్తూ జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్,ఏసిఓ బి సంపత్ కుమార్, ఏవో బి శ్రవణ్ కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్,బి మహేశ్,ఎన్ శ్రీనివాస్ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

## పంటలు ఎండిపోతే ప్రభుత్వంచోద్యం చూస్తుంది

### బీజేపీ నాయకుడు ప్రభాకర్ యాదవ్

### రైతుల కోసం బీజేపీ పోరాటం



రామడుగు,అక్టోబర్ 10(వాయిస్ టుడే): కరెంట్ కోతల కారణంగా పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేకల ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కరెంటు కోతలతో రైతులు పొలాలకు నీరందక తీవ్ర ఇక్కట్లు పడుతుంటే ప్రభుత్వం నిర్లక్షంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.




## అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారుస్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్ మైదానంలో అల్ఫోర్స్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ ఉత్సవాలకు ఆయన సతీమణి సమేతంగా హాజరయ్యి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలను ఎంతో వైభవంగా, ఉత్సాహంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరూ ఎంతో ఆనందంగా జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతీ వైభవానికి ప్రతిబింబమని,తరతరాలుగా వస్తున్న ఈ అద్భుతమైన సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురుమల్ల శ్రీనివాస్ పుట్టినరోజు వేడుకలు

కరీంనగర్ రూరల్,అక్టోబర్ 10 (వాయిస్ టుడే):కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పురమల్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్లుగీత వృత్తి దారుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్యాల రాజా గౌడ్ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తపెల్లి మండల అధ్యక్షులు పంజాల స్వామి గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సుంకె రాజగోపాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ వార్డు సభ్యులు దుర్గం అంజయ్య గౌడ్,బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గుండ మల్లేశం ముదిరాజ్,ఎలగందల్ గ్రామ అధ్యక్షులు ఆరె మల్లేశం గౌడ్, ఆసిఫ్ నగర్ గ్రామ అధ్యక్షులు వార్డు సభ్యులు ఓరుగంటి చంద్రయ్య, ఖాజీపూర్ గ్రామ అధ్యక్షులు అవుడగోని శ్రీనివాస్ గౌడ్,బద్దిపల్లి గ్రామ అధ్యక్షులు బత్తిని గణేష్ గౌడ్, సీనియర్ నాయకులు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్యదర్శి అమిరిశెట్టి కనకయ్య,వార్డు సభ్యులు సీనియర్ నాయకులు కోడూరి



శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింగిరాల వెంకటస్వామి,యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భూస ప్రశాంత్ యాదవ్,ఎస్సీ సెల్ యూత్ మండల అధ్యక్షులు దావా ప్రభాకర్, ఎస్సీ సెల్ మండల నాయకులు ఉల్లెందుల అరుణ్ కుమార్, బద్దిపల్లి సర్పంచ్ అభ్యర్థులు తాండ్ర రాజకుమార్,తాండ్ర తిరుపతి, పద్మశాలి సంఘం మండల ఉపాధ్యక్షులు సిరిమల్ల సుధీర్, యాదవ సంఘం నాయకులు జంగిలి రమేష్ యాదవ్,కాపు సంఘం నాయకులు బోనాల సంతోష్ పాల్గొన్నారు.



## జిల్లా వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 10 : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలలో మరియు నగరంలో మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలను మహిళలు, యువతులు, చిన్నారులు శనివారం ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా తంగేడు గునుగు తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మల ను ఒకచోట ఉంచి వాటి చుట్టూ తిరుగుతూ ఆడి పాడారు. నగరంలో కిల వరంగల్, రంగాసాయి పేట కాశిబుగ్గ, ఎస్ ఆర్ ఆర్ తోట, శివనగర్ వివిధ ప్రాంతాల్లో దేవాలయాల వద్ద, అలాగే ఖాళీ మైదానాలలో మహిళల యువతులు పెద్ద సంఖ్యలో బతుకమ్మను ఆడారు. శివనగర్ మెట్ల బావి దేవాలయం వద్ద జరిగిన బతుకమ్మ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ నిర్వహకులు బతుకమ్మ పండుగ కు డి జే, మంచినీరు లైటింగ్ అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమం లో దేవాలయ అధ్యక్షులు తోట బాబన్న, మాజీ కార్పొరేటర్ దిడ్డి కుమార్ స్వామి, కరాటే ప్రభాకర్ వడ్డే కోటేశ్వరరావు పగడాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ తీరుపై బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ విమర్శలు

### జాతీయ స్థాయి నాయకులు హుందాతనంతో వ్యవహరించాలి

### ప్రజల అభివృద్ధి, దేశ గౌరవానికి ప్రాధాన్యతనివ్వాలి

సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): భారతీయ జనతా పార్టీ సిరిసిల్ల పట్టణ కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించిన విలేకరుల సమావేశం లో పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ తీరుపై విమర్శలు చేశారు. ముందుగా పట్టణ ప్రజలకు ఎంగిలిపూల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేయడాన్ని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీలు బాధ్యతాయుతం గా వ్యవహరించాలని సూచించారు. రాజకీయాల్లో ఉన్నత ప్రమాణాలను పాటిస్తూ, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు అనుగుణంగా నడుచు కోవాలని అన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల రాజకీయ వ్యవహారశైలిపై దుమాల శ్రీకాంత్ విమర్శలు చేశారు. జాతీయ స్థాయి నాయకులు తమ మాటల్లో, చేతల్లో హుందా తనాన్ని ప్రదర్శిస్తూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణం గా వ్యవహరించాలని సూచించారు. దేశ ప్రజల ప్రయోజనాలు, ప్రజా స్వామ్య విలువలు, జాతీయ గౌరవానికి ప్రాధాన్యతనిస్తూ రాజకీయ పార్టీలు బాధ్యతతో పని చేయాలని పేర్కొన్నారు. రాజకీయాలు ప్రజల అభివృద్ధికి దోహద పడేలా, దేశ గౌరవాన్ని కాపాడే విధంగా ఉండాలని బీజేపీ పట్టణ కమిటీ అభిప్రాయ పడుతోందని తెలిపారు. ఈ సమావేశం లో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి దేవరాజు, ఉపాధ్యక్షుడు నరసయ్య, అధికార ప్రతినిధులు మోర రవి, దూడం సురేష్, చొప్ప దండి శ్రీనివాస్, రేగుల కనకయ్య, కోడం శ్రీనివాస్, వడ్నాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి

### – బతుకమ్మ ఘాట్ల నిర్మాణానికి రూ.32 లక్షలు.. ఇతర సౌకర్యాలకు రూ.29.50 లక్షలు

సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 10 (వాయిస్ టుడే): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక గా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపడు తున్నారు. ఈ నేపథ్యం లో పట్టణ పరిధిలోని బతుకమ్మ ఘాట్ల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,బతుకమ్మ పండుగ లో భాగంగా బతుకమ్మల నిమజ్జనా నికి వచ్చే మహిళలు, చిన్నారులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత మున్సిపల్ అధికారు లను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు పండుగ పూర్తయ్యే వరకు అధికారులు సమ న్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది సిరిసిల్ల పట్టణం లోని వివిధ వార్డుల్లో రూ.32 లక్షల వ్యయంతో నూతన బతుకమ్మ ఘాట్ల నిర్మాణం చేపడు తున్నట్లు చైర్‌పర్సన్ తెలిపారు. అలాగే సిరిసిల్ల పట్టణం తో పాటు విలీన గ్రామాల్లోని బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రజల సౌకర్యార్థం రూ.29.50 లక్షలతో వివిధ ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. అనంతరం కౌన్సిలర్లతో కలిసి బతుకమ్మ నిమజ్జన ఘాట్లను, పరిసర ప్రాంతాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ ఎం.డి. ఖాదిర్ ఫాషా, విప్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్లు బింగి రాంబాబు, ఆడెపు చంద్రకళ ప్రభాకర్, మామిడాల మహేష్, ఏఈ నరసింహస్వామి, ఇతర అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్
హైదరాబాద్
ఆదివారం 11 అక్టోబరు 2026



## బిజెపి ఓటు చోరీపై కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష

కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): దేశంలో బీజేపీ అనుకూలిత చర్యలు చేపడుతూ ఓట్లను తీసివేస్తున్న భారత ముఖ్య ఎన్నికలాదికారి జ్ఞానేశ్వర్ వెంటనే రాజీనామా చేయాలని నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ఎన్డిఏ కూటమి దేశంలో ఓట్ల దొంగతనాలు,సీట్ల దొంగతనాలు జరుగుతుంటే,ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుంటచీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ మోడీకి వంత పాడుతున్నాడు.రాహుల్ గాంధీ, మల్లికార్జున కర్గే,ప్రియాంక గాంధీ,ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలిపి,ధర్నా చేస్తుంటే అక్రమంగా,దౌర్జన్యంగా లాఠీచార్జి చేసి,అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ నిరసన తెలియజేస్తున్నాము అన్నారు.ఆనాడు భారతదేశాన్ని దోచుకోవడానికి ఈస్ట్ ఇండియా కంపెనీ బయలు దేరితే,ఈనాడు ఎన్డీఏ కూటమి దేశాన్ని దోచుకునే కార్యక్రమంలో భాగంగా ఓట్లు,సీట్లు దొంగతనం చేస్తూ ప్రజల యొక్క హక్కులను కాలరాస్తూ నటువంటి ఎన్డీఏ కూటమి దిగిపోవాలని సిఇసి జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామా చేయాలని,వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైద్యుల అంజన్ కుమార్,ఆకారపు భాస్కర్ రెడ్డి,అబ్దుల్ రెహమాన్,పర్వత మల్లేశం,వరాల నర్సింగం,కాంతాల జగన్ రెడ్డి,మూల జయపాల్,దన్నసింగ్,కామ్రెడ్డి రాంరెడ్డి, సాయిని తిరుపతి,లాయికు,కంకణాల అనిల్ కుమార్ గుప్తా,గట్టు ప్రశాంత్, కలీముద్దీన్,పడిశెట్టి భూమయ్య,చింతల ఎల్లారెడ్డి,మిర్యాల శ్రీధర్ రెడ్డి,అందశంకర్, పట్టెం రాజేష్, పున్న అనిల్,జాకీ,భూపతి శ్రీనివాస్, జిఎస్ ఆనంద్,హైమద్,తాంద్ర శంకర్,ఆకుల నరసయ్య,ఎండి తాజ్,కర్ర రాజశేఖర్, శ్రావణ్ నాయక్,ఆహమ్మద్ అలీ,వెన్నం రజిత రెడ్డి,ఫహాద్,కాంతాల జగన్ రెడ్డి,ఆకుల ఉదయ్,పొన్నం శ్రీనివాస్ గౌడ్,సరిల్లా రతన్ రాజు,జల్లోజు శ్రీనివాస్, అమేర్,వేమారపు శ్రీనివాస్,మూల కృష్ణారెడ్డి,ఇమ్రాన్,తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్,నిహాల్,సలీముద్దీన్,మాలోతు మహాలక్ష్మి,స్వప్నశ్రీ,గడప శ్రీనివాస్,ఇమ్రాన్ ఘని,శుకూర్, చిలుక హనుమంత రెడ్డి, మాజీదు అలీ ఖాన్,ఎం ఏ కరీం,గడ్డం శ్రీనివాస్,అందే శంకర్,పాష, హైమద్,రూపీ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తాళ్లపల్లి అంజయ్య గౌడ్, హాజీ, కోడూరు రవీందర్ గౌడ్,మమత, మార్కరాజు,జిలకర రమేష్,వీర దేవేందర్, సత్రం శ్రీకాంత్,కుంభాల రాజకుమార్,నూనె గోపాల్ రెడ్డి,అక్బర్ పాల్గొన్నారు.



## మనో వ్యాధులకు మందులు ఉన్నాయి

**ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ వర్షి**

కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): ప్రపంచవ్యాప్తంగా గణనీయ సంఖ్యలో మానవాళి మానసిక రుగ్మతల బారినపడి అనారోగ్యాల పాలు అవుతున్నారని,నేడు మానసిక వ్యాధులకు సహితం వైద్యం అందుబాటులోకి వచ్చిందని ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎల్ వర్షి అన్నారు.ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సుమ ఆసుపత్రి ప్రాంగణంలో శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానసిక ఒత్తిడి,ఆందోళన,భయం, ఒంటరితనం,మాదక ద్రవ్యాల వినియోగం,పని ఒత్తిడి,నిద్రలేమి లాంటి పలు కారణాల మూలంగా మానసిక అనారోగ్యం కలుగుతుందని,త్వరగా గుర్తిస్తే పూర్తి చికిత్స చేయవచ్చని తెలిపారు.ఒక నాడు మనో వ్యాధికి మందు లేదు అనే స్థాయి నుంచి నేడు సరైన సమయంలో సరైన వైద్యులను సంప్రదిస్తే పూర్తి చికిత్స జరుగుతుందని తెలిపారు.మానసిక రుగ్మతను రెండు వారాల్లో గుర్తిస్తే మంచి చికిత్స అందించవచ్చని తెలిపారు.మానసిక వైద్యులను సంప్రదించడానికి పౌర సమాజం వెనుకంజ వేయవద్దని,నేటి వేగవంతమైన జీవనశైలిలో మానసిక రుగ్మతలు ఎక్కువగా నమోదు అవుతున్నాయని తెలిపారు.మానసిక రుగ్మతలకు కౌన్సిలింగ్,ఔషధ చికిత్స కూడా అవసరం కావచ్చని తెలిపారు. ప్రోగ్రామ్ చైర్మన్ లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా సమస్యగా అవతరిస్తున్న మానసిక సమస్యలు 45 కోట్ల ప్రజలను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.14 ఏండ్ల వయస్సు నుంచి 100 ఏండ్ల వృద్ధుల వరకు అందరూ మానసిక రుగ్మతల బారినపడుతున్నారని విచారం వ్యక్తంచేశారు. మానసిక సమస్యల పట్ల కనీస అవగాహన కలిగి ఇరుగుపొరుగు పౌర సమాజానికి తగిన సూచనలు ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లయన్ ఎం మహేందర్,లయన్ ఎన్ వేణుగోపాల్,లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,లయన్ ఈ రమేష్,లయన్ కె రాజెందర్ రెడ్డి, లయన్ వి జగదీశ్వరాచారి,లయన్ డా ఎస్ మనోహరాచారి,లయన్ డి తిరుపతి రెడ్డి,లయన్ కె సత్యం, లయన్ పి సురేందర్,ఆసుపత్రి సిబ్బంది,నగర పౌరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో బీజేపీ, బీఆర్ఎస్‌ది మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయం

**రెండు పార్టీలది అంతా నాటకం బూటకం**

**మునిగిపోతున్న రెండు నావలపై ఎక్కేదెవరు చేరికలంతా బూటకం**

**సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): నగరంలో బీజేపీ,బీఆర్ఎస్ రెండు పార్టీలు పరస్పర రాజకీయ ప్రయోజనాల కోసం మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలకు పాల్పడుతున్నాయని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక నరేందర్ రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఎన్నికలైనా బీజేపీ,బిఆర్ఎస్ రెండు పార్టీలనాయకులు ఒకరికొకరు తెర వెనుక సహకరించుకొని తెర ముందు ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం దాదాపు రెండు దశాబ్దాలుగా జరుగుతున్నదని ఇకపై ఇలాంటి డ్రామాలను ప్రజలు సహించరని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.స్మార్ట్ సిటీ ప్రాజెక్టుతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై అప్పట్లో స్పందించని నాయకులు ఇప్పుడు మాట్లాడటం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని విమర్శించారు.గణేశ్ నిమజ్జనానికి నీటి విడుదలపై బీజేపీ డ్రామా ఆడితే,బతుకమ్మ పండుగ ఏర్పాట్లపై బిఆర్ఎస్ మున్సిపల్ ముట్టడి డ్రామా ఆడుతోందని విమర్శించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పర్యవేక్షితున్నారని,ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించబోదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

# డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**దంపు యార్డులో చెలరేగుతున్న మంటలు, పొగలను అదుపు చేయించిన మేయర్**

**స్వచ్ భారత్ మిషన్ రూ.17 కోట్లతో బయోమైనింగ్,యూసిఎఫ్ రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్**



కరీంనగర్,అక్టోబర్ 100(వాయిస్ టుడే): దశాబ్ధాలుగా పేరుకు పోయిన డంపింగ్ యార్డు చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు.కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధలో భాగంగా కార్పోరేటర్లు,అధికార సిబ్బందితో కలిసి డంపింగ్ యార్డును సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తనిఖీ చేసి పరిశీలించారు.డంపింగ్ యార్డులో చెలరేగుతున్న మంటలను,పొగను అదుపు చేసేందుకు స్థానికంగా ఉండి అధికారులు సిబ్బందితో తక్షణ చర్యలు చేపట్టారు. మున్సిపల్ వాటర్ ట్యాంకర్లకు మోటార్ ప్రెషర్ పంపులను అమర్చి చెలరేగుతున్న మంటలను అదుపు చేయించారు.పూర్తి స్థాయిలో మంటలు,పొగలు ఆర్పేందుకు సిబ్బందిని బృందాలుగా నియమించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అనంతరం అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించి,మంటలు ఆర్పేందుకు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు.ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. గత 40 నుంచి 50 ఏళ్లుగా డంపింగ్ యార్డు లో 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పేరుకుపోయిందని,దీంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు పొగ, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దంపు యార్డు సమస్యకు ముగింపు పలకడమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సహాకారంతో స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులు చేసేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు.త్వరలోనే బయోమైనింగ్ ప్రక్రియ కు సంబంధించి 4 యంత్రాలను ఏర్పాటు చేసి పనులు ప్రారంభం చేస్తామని స్పష్టం చేశారు.6 నుండి 7 నెలల వ్యవధిలోనే దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ ద్వారా వేగవంత చేస్తామన్నారు.కొత్తగా వచ్చే చెత్త ద్వారా గతంలోనే స్మార్ట్ సిటీలో ప్రారంభం చేసిన బయోమైనింగ్ ప్రక్రియ ఆలస్యం అవుతుందని తెలిపారు. అంతే కాకుండా బండి సంజయ్ కుమార్ సహాకారంతో మరో 20 కోట్లు తెచ్చేందుకు చర్యలు తీస్కుంటూ ప్రణాళిక ప్రకారం తమ పాలకవర్గం ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న చెత్తను ప్రక్షాళన చేయడంతో పాటు కొత్తగా రోజు వచ్చే చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేపట్టేలా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు మాసం గణేష్,పిపిఏ చంద్ర,తోట అనిల్, మేకల వెంకటేష్షి,శెట్టి వసంత లక్ష్మీ భూమయ్య,నాయకులు బండారి గాయత్రి,వెంకట్ రెడ్డి,మొండయ్య పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన బతుకమ్మ వేడుకలు - ఉల్లాసంగా మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ

**సంప్రదాయ దుస్తుల్లో మహిళల సందడి..**
**బతుకమ్మ పాటలతో మార్మోగిన బతుకమ్మ ప్రాంగణాలు**

జమ్మికుంట అక్టోబర్ 10 (వాయిస్ టుడే) : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు జమ్మికుంట పట్టణంలో ప్రారంభమయ్యాయి. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి మహిళలు ఆటపాటలతో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, ఐక్యత, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ పట్టణంలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంప్రదాయాలను కాపాడుతూ, భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేసేలా బతుకమ్మ వేడుకలు కొనసాగుతున్నాయి. మహిళల ఉత్సాహంతో జమ్మికుంట పట్టణంలో బతుకమ్మ సందడి నెలకొంది.

## సాయి దివ్యాంగ విద్యార్థుల ఆశ్రమంకు బియ్యం వితరణ

జమ్మికుంట అక్టోబర్ 10 (వాయిస్ టుడే): శనివారం రోజున హుజరాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు జమ్మికుంట మండల కేంద్రంలోని సాయి దివ్యాంగుల విద్యార్థుల ఆశ్రమం నందు ట్రస్టు నిర్వాహకులు సామాజిక కార్యకర్త,డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్ 50 కిలోల బియ్యాన్ని దివాంగుల ఆశ్రమం నిర్వాహకులు బుచ్చి రాములుకు అందజేశారు. ఇదే సందర్భంగా బాల్యమిత్రుడు ఇనుగాల ప్రసాద్ రిటైర్డ్ టీచర్ పప్పు, ఆలుగడ్డలు, ఉల్లిగడ్డలు అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల ఆశ్రమము నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో కూడా గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు చాలాసార్లు సందర్శించి ఆశ్రమంలోని విద్యార్థులకు దుప్పట్లు, బ్లాంకెట్స్, టవల్స్, బియ్యము అందజేశారని తెలుపుతూ మధురమ్మ ట్రస్ట్ వారు ప్రతినిత్యం సమాజంలో చేస్తున్నటువంటి సేవలను వెలగట్టలేమని తెలుపుతూ తరచుగా మా ఆశ్రమాన్ని సందర్శించి అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆశ్రమము అభివృద్ధిలో పాలుపంచుకోవాలని తెలిపారు. ఈరోజు ఆశ్రమానికి 50 కిలోల బియ్యం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనగాల ప్రసాద్ రిటైర్డ్ టీచర్, ఆశ్రమం సిబ్బంది, దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

## సీరత్-ఉన్-నబీ పరీక్ష యొక్క బహుమతుల ప్రధానం



హుజూరాబాద్ అక్టోబర్ 10 (వాయిస్ టుడే): జమియత్ ఉలమా హుజురాబాద్ వారి ఆధ్వర్యంలో సీరత్-ఉన్-నబీ పై నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రధమ ద్వితీయ తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విద్యార్థులకు శనివారం రోజు సిటీ సెంటర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జల్సా కార్యక్రమంలో సూట్కేస్, మెమొంటో తో పాటు సర్టిఫికెట్స్ లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమియత్ ఉలమా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముఫ్తీ యూనుస్ కాస్మి , ఉపాధ్యక్షులు ముఫ్తీ గియాస్ మొహియుద్దీన్ , ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సాదిక్ హుస్సేన్ పాల్గొని వారి చేతుల మీదుగా అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దైవభక్తి, ఇస్లామిక్ విలువలు,ప్రవక్త ముహమ్మద్ వారి జీవిత చరిత్ర పట్ల అవగాహనను పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని. విద్యార్థులలో ధార్మిక విద్యను పెంపొందిస్తూ,సత్ప్రవర్తనతో కూడిన సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న జమియత్ ఉలమా హుజురాబాద్ కమిటీ సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జామే మస్జిద్ ఢ ఈద్గా మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ అష్ఫాక్ (ఆషు)తో పాటు,హుజురాబాద్ జమియత్ ఉలమా కమిటీ అధ్యక్షులు మీర్జా ఇమ్రాన్ బేగ్, జనరల్ సెక్రటరీ ముఫ్తీ షాకిర్ గారు,మసీదు కమిటీ సభ్యులు, జమియత్ ఉలమా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిత్ళ రుణం తీర్చుకున్న సానే కుటుంబం భక్తిశ్రద్ధలతో మహాలయ అమావాస్య వేడుకలు

శ్రీకాళహస్తి(వాయిస్ టుడే)అక్టోబర్ 10: కంటికి కనిపించకపోయినా. మన వెంటే ఉండి నడిపించే దైవాలు మన పూర్వీకులు జన్మనిచ్చిన తల్లిదండ్రులను, తరతరాల మన పెద్దలను స్మరించుకునే పవిత్ర దినం. మహాలయ అమావాస్య ?శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మహాలయ అమావాస్య పర్వదినం సందర్భంగా పితృ దేవతల స్మరణతో పులకించిపోయింది. మనల్ని కని, పెంచి, ఈ లోకానికి పరిచయం చేసిన పెద్దలను స్మరించుకుంటూ, వారి రుణం తీర్చుకునే ఈ పవిత్ర రోజున. శ్రీకాళహస్తిలో ఒక కుటుంబం ఆదర్శవంతమైన సేవతో అందరి ప్రశంసలు అందుకుంది. స్థానిక పెళ్లి మండపం వద్ద ఉన్న లక్ష్మీ ఫ్యాన్స్ షాపు ప్రాంగణంలో. సానే రవికుమార్, ఆయన సతీమణి గీత, కోడలు హిమజ, కొడుకు రాజా మరియు మనవడు దాశిక్ ఆధ్వర్యంలో మహాలయ అమావాస్యను పురస్కరించుకుని ఘనంగా పితృ కార్యక్రమాలు నిర్వహించారు.?కేవలం పూజలతో సరిపెట్టకుండా, తమ పూర్వీకుల ఆశీస్సులు ప్రజల రూపంలో అందరికీ అందాలనే సత్సంకల్పంతో. సుమారు వంద మందికి పైగా భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. భక్తిశ్రద్ధలతో పూర్వీకులను తలచుకుంటూ సానే కుటుంబం చేసిన ఈ అన్నదాన కార్యక్రమం స్థానికంగా ఎంతో మంది హృదయాలను హత్తుకుంది.పుట్టిన ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులను, పూర్వీకులను గౌరవించడం, వారి జ్ఞాపకాలను సేవ రూపంలో నిలపడం మన సంస్కృతికి నిదర్శనం. నేడు సానే కుటుంబం చేసిన ఈ అన్నదానం కేవలం ఒక కార్యక్రమం కాదు. తరతరాల మన పెద్దల ఆశీస్సులను నలుగురికీ పంచుతూ వారు చూపిన మానవతా మార్గం ?ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొన్న పుర ప్రజలు, భక్తులు సానే కుటుంబాన్ని మనస్ఫూర్తిగా అభినందించారు. పూర్వీకుల స్మరణలో నిత్యం ముందుండే ఇలాంటి కుటుంబాలు సమాజానికి స్ఫూర్తిదాయకం.

# ఉనికి కోసం బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు

**ప్రజా విశ్వాసం కోల్పోయిన పార్టీ**

**ఔట్ డేటెడ్ పార్టీ బిఆర్ఎస్**

**మీడియా సమావేశంలో**
**బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్**



కరీంనగర్,అక్టోబర్ 10(వాయిస్ టుడే): నగరంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోసమే డ్రామా రాజకీయాలు చేస్తోందని కిసాన్ నగర్ 29వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత పార్టీలో ఉన్నవారినే కొత్తగా చేరికలంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను మోసం చేస్తున్నారని,ఇదొక పెద్ద ఫేక్ ప్రచారమని మండిపడ్డారు. కిసాన్‌నగర్‌లో బీఆర్ఎస్‌లోకి చేరికలు జరిగినట్లు జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, సోషల్ మీడియాలో పబ్లిసిటీ కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు.ప్రజలను గందరగోళానికి గురిచేయడానికే ర్యాలీలు నిర్వహించి, చేరికల సమావేశాలు పెట్టడం సిగ్గుచేటన్నారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు సర్వస్వం గులాబీమయం చేసుకున్న బీఆర్ఎస్ నేతలకు,ఇప్పుడు కాషాయ రంగును చూస్తే కడుపుమంట ఎందుకని ప్రశ్నించారు.ప్రభుత్వ భవనాలు, రోడ్లు,ప్రతి చిహ్నాన్ని గులాబీ రంగుతో నింపేసినప్పుడు లేని తప్పు,ఇప్పుడు కాషాయ రంగు కనిపిస్తేనే ఎందుకు వస్తోందని నిలదీశారు.టౌన్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ ఆ పదవికి అనర్హుడని, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేస్తే ప్రజలు ఆయనను తిరస్కరించారన్నారు.మేయర్ పీఠాన్ని కోల్పోయి సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా చల్లా హరిశంకర్ సిగ్గులేకుండా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్,మాజీ మేయర్ రవీందర్ సింగ్,ఏడ్ల అశోక్,కంసాల శ్రీనివాస్ లతదితరుల ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. కరీంనగర్ కిసాన్ నగర్ లో దళితబంధు ఇళ్ళు ప్రొసీడింగ్స్ ల పేరుతో పేదల నుంచి వేల రూపాయలు వసూలు చేశారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయని,దయచేసి వారందరికీ తిరిగి డబ్బులు ఇవ్వాలని కోరారు.బీసీ నాయకుల ముసుగు కప్పుకొని దొరల పార్టీ వెనుక తిరుగుతూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. దళిత బంధు విషయంలో బాధితులు ఇప్పటికీ న్యాయం కోసం ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవ వల్లే నగరంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్,స్మార్ట్ సిటీ ద్వారా భారీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్పష్టం చేశారు.ప్రజా విశ్వాసం కోల్పోయి అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ ఒక 'అవుట్‌డేటెడ్' పార్టీ అని,ఆ మునిగిపోయే నావలో చేరేందుకు ఎవరూ సిద్ధంగా లేరని విషయాన్ని బిఆర్ఎస్ నాయకత్వం గ్రహిస్తే మంచిదన్నారు. బిఆర్ఎస్ నేతలు చిల్లర రాజకీయాలు మానుకోవాలని, లేకపోతేప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ సమావేశంలో కార్పొరేటర్లు రవీంద్ర భూపతి,మేకల వెంకటేష్,కర్రే పద్మా అనిల్,పొన్నం మొండయ్య,కార్యకర్తలు

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**